

బ్యాలెట్.. బాక్సింగ్

ఉద్యోగుల సెంటిమెంటే ఈసారీ పునరావృతం?

ఉద్యోగులు ఎటువైపు మొగ్గుచూపితే... ఫలితం ఆ వైపే!.. ఇది గడిచిన రెండు పర్యాయాల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నిరూపించింది. ఈసారి ఉద్యోగులు వేసిన పోస్టల్ బ్యాలెట్‌లో ఎవరికి అనుకూలత అనే దానిపై ప్రధాన పక్షాలకు ఒక స్పష్టత వచ్చినా తిరిగి ఇదే అంశంపై వాదోపవాదాలు, బెట్టింగ్‌లు మళ్ళీ పుంజుకున్నాయి.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

- ఎటుచూసినా ఈ దిశగానే బెట్టింగ్‌లు
- పోస్టల్ బ్యాలెట్‌లు అత్యధికం ఏవైపు అనే దానిపైనా పందేలు
- ఉద్యోగుల పాత్రపైనే అందరి దృష్టి

ఉద్యోగుల సెంటిమెంట్..

ప్రభుత్వ కార్యకలాపాల్లో ప్రధాన భూమిక పోషించేది ఉద్యోగులే. వారిపనితీరు సమర్ధ వంతంగా ఉంటే ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల మన్నన పొందుతాయి. ఆ రూపంలో ప్రభుత్వానికి కొంత ప్రజా మద్దతు అలవోకగా దక్కుతుంది. కాని గడిచిన ఐదేళ్లల్లో అధికార వైసీపీ ప్రభుత్వ ఉద్యోగుల వ్యతిరేక విధానాల వైపే మొగ్గు చూపింది. కొంతమందిని మినహాయించి మిగతా ఉద్యోగులను పట్టించుకోకుండా గాలికి వదిలేసింది. వారికి చెందాల్సిన బకాయిలను చెల్లించకుండా నిలిపివేసింది. పీఆర్సీ అమలు దగ్గర నుంచి పోలీసులకు వారాంతపు సెలవు వరకు జగన్ సర్కార్ నోట నీటి మూటలు అయ్యాయి. పర్యావసానంగా ఉద్యోగ వర్గాలు ప్రభుత్వంపై అసంతృప్తి పెంచుకుంటూ పోయాయి. పోలింగ్ నాటికి ఇది గరిష్ఠస్థాయికి చేరింది. ఈ లోపే పోలింగ్ విధులకు హాజరయ్యే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 15 వేల మందికి పైగా ఈ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. ప్రతిసారి పోస్టల్ బ్యాలెట్‌ను కేవలం కొంతమంది మాత్రమే వినియోగించుకుని మిగతా వారు ఓటుకు దూరంగా మిగిలేవారు. ఈసారి జిల్లావ్యాప్తంగా 16 వేల మందికి పైగా పోలింగ్ విధులకు హాజరయ్యే సిబ్బందిలో 15 వేల మందికి పైగా తమ ఓటుహక్కును విని యోగించుకోవడం గమనార్హం. ప్రభుత్వ వ్యతిరేకత ఈ సమయంలో కొట్టొచ్చినట్టు కనిపించిందని అప్పుడే విశ్లేషించారు. వాస్తవానికి ఉద్యోగులు ఏవైపు మొగ్గు చూపుతారో ఫలితాలు సమాం తరంగా వెలువడతాయనే పాత సెంటిమెంట్ ఈసారి తమకే కలిసి వస్తుందని కూటమి లెక్క కట్టింది. పోస్టల్ బ్యాలెట్‌తో పాటు మిగతా ఉద్యోగ వర్గాలు తమ ఓటుహక్కు వినియోగంలో చొరవ చూపారని, అంతేకాకుండా తమతో పాటు మరి కొంతమందిని పోలింగ్ కేంద్రాలకు చేర్చారని, ప్రభుత్వ వ్యతిరేకత నేపథ్యంలో జాగ్రత్తగా చూసి ఓటు వేయమని ఓటర్లకు హితబోధ చేయడం ఎవరు కాదనలేని నిజం. 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఉద్యోగ వర్గాలు తెలుగుదేశం, బీజేపీ కూటమి వైపే మొగ్గు చూపాయి. 2019 వచ్చేసరికి ఉద్యోగులు జగన్ వైపు జై కొట్టారు. ఈ రెండు ఎన్నికలను పరి శీలిస్తే ఉద్యోగులు ఎటువైపు మొగ్గు చూపితే ఆ పార్టీయే అధికారంలోకి వస్తుందని ఒక సెంటి మెంట్ ఉంది. ఇప్పుడు జరిగిన ఎన్నికల్లోనూ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ఉద్యోగులతో పాటు మిగతా ఉద్యోగ వర్గాలన్నీ వైసీపీ వ్యతిరేకత తో రగిలిపోయి ఉండడమే కాకుండా కూటమి వైపే వీరంతా మొగ్గు చూపారు. ఈసారి పోలింగ్ అర్ధరాత్రి వరకు సాగినా తాము అనుకున్న లక్ష్యం నెరవేరేందుకు విధుల్లో ఉన్న ఉద్యోగులు విసుగు, విరామం లేకుండా ఓపికగా పోలింగ్ నిర్వహించ డాన్ని మరికొందరు గుర్తు చేస్తున్నారు. ఏదైనా నియోజకవర్గంలో నువ్వానేనా అన్నట్లు ఓట్ల లెక్కింపు సమయంలోనూ కొనసాగితే పోస్టల్ బ్యాలెట్‌లే కూటమికి కలిసివచ్చే అవకాశం లేకపోలేదు.

ఉద్యోగుల ఓటుపైనే బెట్టింగ్‌లు

ఉద్యోగ వర్గాలు ఏ పార్టీకి మద్దతుగా నిలిచారో.., చివరి క్షణంలో ఓటువేసిన మహిళలు ఎటువైపు గాలి తిప్పబోతున్నారు. యువకులు, రైతులు, కార్మికులు కసితో వేసిన ఓట్లు ఏ పార్టీ కొంప ముంచబోతున్నాయి. మరే పార్టీకి దోహదం చేయబోతున్నాయనే దానిపైనే ఇప్పుడు బెట్టింగ్‌లు సాగుతున్నాయి. జిల్లా కేంద్రమైన ఏలూరులో ఉద్యోగుల సంఖ్య అత్యధికం. ఏలూరు నియోజక వర్గంలో కూటమి వైపు మొగ్గు చూపారని, మిగతా వర్గాలు ఆ దిశగానే పయనించాయని ఇక్కడ టీడీపీకి తిరుగులేని ఆధిక్యత లభిస్తుందని, ఉద్యోగుల ఓట్లను విశ్లేషించి మరీ ఈ బెట్టింగ్‌లు సాగుతున్నాయి. ఇక్కడ పోస్టల్ బ్యాలెట్‌లతో పాటు మిగతా ఉద్యో గుల ఓట్లు ఏకపక్షంగా కూటమివైపు మళ్ళాయన్నదే వాదనగా రూ.25 లక్షల నుంచి రూ.90లక్షల వరకు పందేలు సాగాయి. మరికొంత మంది ఉద్యోగుల్లో వైసీపీ అనుకూలురు కూడా భారీగానే ఉన్నారనే విషయాన్ని విస్మరించ కూడదని వీరితో పాటు తటస్థులు సైతం వైసీపీవైపు మొగ్గు చూపారంటూ పందేలు కాస్తున్నారు. నియోజక వర్గాల వారీగా ఉద్యోగుల ఓట్లే కీలకం కాబోతున్నాయా? లేదా? అనే దానిపై బెట్టింగ్‌ల జోరు పుంజుకుంది. నూజివీడు మునిసి పాలిటీలో, చింతలపూడి నియోజకవర్గంలోని జంగారెడ్డిగూడెం, చింతలపూడి నగరపంచాయతీల పరిధిలోనూ ఈ తరహా పందేలే జోరుగా ఉన్నాయి. ఉద్యోగుల ఓట్లనే ప్రామాణికంగా తీసుకుని బెట్టింగ్‌లకు దిగడం ఈసారి హైలెట్. ప్రత్యేకించి ఉపాధ్యాయ వర్గాలు అత్యధికంగా కూటమి వైపు సాగారనే పందేలకు మాత్రం కొందరు వెనుకంజ వేస్తున్నారు.

• కల్యాణ వైభోగమే..

సర్వజగద్రక్షకుడైన ద్వారకా తిరుమల చిన వెంకన్న సర్వాభరణ భూషితుడై నుదుటున కల్యాణ తిలకం... బుగ్గన చుక్కలతో సిగ్గులొలుకుతున్న అలివేలు మంగ, ఆండాళ్ దేవేరులను బుధవారం రాత్రి పరిణయ మాడారు. ఈ కల్యాణ ఘడియలో స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని వీక్షించి భక్తజనులు తరించారు.



ప్రాణాలతో చెలగాటం!

నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు

- అయోమయంలో పేద ప్రజలు
- పేరుకే రూ.పాతిక లక్షల కార్డు
- పైసాకు విలువ లేకుండా పోయింది..
- ప్రభుత్వాస్పత్రిలో పడకల కొరత
- ప్రభుత్వం తీరుపై విమర్శలు



ఏలూరు క్రైం, మే 22 : ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్లు చేయబోమని ప్రకటించడంతో జిల్లాలోని పేదలు అయోమయంలో పడ్డారు.ఆరోగ్యశ్రీ కింద చేసిన ఆపరేషన్లకు ప్రభుత్వం నిధులను సకాలంలో ప్రైవేటు ఆస్పత్రులకు ఇవ్వకుండా బకాయిలను పెండింగ్ పెట్టడడంతో తాము ఇక ఆపరేషన్లు చేయబోమని ప్రైవేటు ఆస్పత్రుల సంఘం ప్రకటించడంతో బుధవారం నుంచి ఆపరేషన్లు నిలిపివేశారు. జిల్లాలోని ఆశ్రంలోను పూర్తిగా ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేశారు. అయితే ఎవరైనా అత్యవసర, ప్రమాదకరమైన కేసులతో వస్తే వారికి ఉచిత ఓపీ, ఆపరేషన్లలో వైద్య సేవలలో కొంత రాయితీలను యాజమాన్యం కల్పించింది. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇప్పటికే ఆరోగ్యశ్రీ కింద చేరి అప్రూవల్ కోసం ఎదురు చూస్తున్న కేసులకు సంబంధించిన రోగులకు వైద్య సేవలు అందిస్తామని ప్రకటించారు. కానీ కొత్తగా ఏ ఒక్కరిని జిల్లాలో బుధవారం చేర్చుకోలేదు. జిల్లాలో 31 ప్రైవేటు ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ సేవలను పేదలకు అందిస్తున్నాయి. ఏలూరు ప్రభుత్వాస్పత్రి, మరో రెండు ఏరియా ఆస్పత్రులు, మరో ఏడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వివిధ రకాల వైద్య సేవలను అందిస్తున్నాయి. ఇంకోవైపు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసూతి వైద్య సేవలకు మాత్రమే ఆరోగ్యశ్రీ కింద అనుమతులు ఉన్నాయి. కానీ ప్రభుత్వాస్పత్రుల్లో కొన్ని వైద్య సేవలు అంతంత మాత్రంగా ఉండడంతో చివరకు ప్రైవేటు ఆస్పత్రులకే ప్రజలు మొగ్గుచూపుతున్నారు. దీంతో సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రులు, స్పెషలిస్టులు ఉన్న ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ కింద సేవలు పొందడానికి ప్రజలు వెళ్తున్నారు. రూ.25 లక్షలు వరకు ఆరోగ్యశ్రీ కార్డులో వైద్యసాయం పొందవచ్చని వైసీపీ ప్రభుత్వం గొప్పగా చెబుతున్నప్పటికీ బుధవారం నుంచి ఆ కార్డు ఎందుకు పనికి రాకుండా పోయింది. కేవలం ప్రభుత్వాస్పత్రిలో మాత్రమే ఆ కార్డు చెల్లుబాటు అయ్యేలా ఉంది. ఆరోగ్యశ్రీ కింద వైద్యం పొందడానికి బుధవారం ఎంతో ఆశతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లిన పలు రోగులకు ఆ కార్డు చెల్లదని చెప్పడంతో బిత్తర పోయారు. వేలాది రూపాయలు పెట్టి వైద్యం పొందలేదని కొంత మంది వెనుతిరిగి వెళ్ళిపోగా, మరి కొంత మంది ప్రాణాలు నిలబెట్టుకోవడానికి తమ స్థోమత్తను మించి అప్పులు చేయడానికి సిద్ధమయ్యారు. జిల్లాలో 31 ప్రైవేటు ఆస్పత్రులు పేదలకు సేవలందిస్తున్న తరుణంలోనే ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో నిత్యం పడకలే ఖాళీగా ఉండడం లేదు. ఇక అక్కడ సేవలు నిలిపి వేస్తే వందలాది మంది ప్రభుత్వాస్పత్రికి వస్తే ఎలా సేవలు అందిస్తారనే ప్రశ్న నెలకొంది. పేదల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందన్న విమర్శలు వస్తున్నాయి.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం..

ఏలూరు ఆశ్రంలో ఆరోగ్యశ్రీ కింద వైద్య సేవలు పూర్తిగా నిలిపి వేశారు. అక్కడ అత్యవసర విభాగంలోనే ఆరోగ్య మిత్రాలను ఏర్పాటు చేశాం. ఎవరైనా ఆరోగ్యశ్రీ సేవలు పొందడానికి అక్కడకు వస్తే వ్యాధిని బట్టి సంబంధిత స్పెషాల్టీ ఉన్న ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేస్తున్నాం. వారికి అవసరమైన సలహాలు, సూచనలు, సహాయాన్ని అందించడానికి ఆరోగ్య మిత్రాలను ఏర్పాటు చేశాం. ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో ఆరోగ్య శ్రీ కింద అదనపు పడకలు ఏర్పాటు చేయాలని మెడికల్ సూపరింటెండెంట్‌ను కోరాం. ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేస్తున్నాం. ఈ సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని భావిస్తున్నాం.

- డాక్టర్ ఐ.రాజేష్, జిల్లా కో ఆర్డినేటర్ ఆరోగ్య ట్రస్టు

టెన్షన్..టెన్షన్

- ఏలూరు ఫైర్‌స్టేషన్ వద్ద ఆందోళన కారుల ర్యాలీ
- లాఠీఛార్జి, టియర్ గ్యాస్ ప్రయోగం ఆపై ఫైరింగ్
- పలువురికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- ఏలూరు రోడ్లపై పోలీసుల మాబ్ డ్రిల్







ఏలూరు క్రైం, మే 22 : ఏలూరు ఫైర్‌స్టేషన్ వద్ద బుధవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో కొత్త బస్టాండ్ వైపు నుంచి ఒక వంద మంది చేతిలో కర్రలు, రాళ్ళు, వాటర్ బాటిల్స్, టైర్లు, ఇతర వస్తువులతో కేకలు వేస్తూ పోలీసులకు వ్యతిరేకంగా అరుచుకుంటూ వస్తున్నారు. మరోవైపు ఆస్పత్రి రోడ్డువైపు నుంచి అతి వేగంగా పోలీసు వాహనాలు చేరుకున్నాయి. ఫైర్‌స్టేషన్ ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసు భద్రతా దళాలు రంగంలోకి దిగారు. ఇంకోవైపు క్షణంలోనే జిల్లా ఉన్నతాధికారుల వాహనాలు అక్కడకు చేరాయి. ఆందోళన కారులను మైక్‌ల ద్వారా పోలీసులు హెచ్చరించినా లెక్కచేయకుండా రాళ్ళు విసరడంతో లాఠీఛార్జీ మొదలు పెట్టారు. అల్లరి మూకలు తిరగబడి టైర్లను కాల్చి వారిపైకి విసిరేశారు. వాటర్ బాటిళ్లు, రాళ్ళు, ఇతర వస్తువులతో అల్లకల్లోలం చేశారు. అక్కడే ఉన్న ఆర్మడు రిజర్వు అధికారులు, సిబ్బంది ఉన్నతాధికారుల ఆదేశాల కోసం ఎదురు చూశారు. ఉన్నతాధికారులు, మేజిస్ట్రేట్ ఫైరింగ్‌కు అనుమతి ఇచ్చారు. తొలుత టియర్ గ్యాస్‌ను పేల్చారు. టియర్ గ్యాస్ బాతిరిగి వాటినే అల్లరి మూకలు పట్టుకుని తిరిగి పోలీసుల పైకి విసిరారు. ఇక లాభం లేదనుకుని ఒక్కసారి రబ్బర్ బులెట్ల వర్షం కురిపించారు. దీంతో అవి తగిలిన వారంతా కుప్పకూలి పడిపోయారు. క్షణాల్లోనే వారిని అంబులెన్సుల్లో ఆస్పత్రికి తరలించారు. సుమారు గంటసేపు అక్కడ ఏం జరుగుతుందో సాధారణ జనానికి అర్థం కాలేదు. రోడ్లపై వెళ్తున్న వాళ్లు, దుకాణాల్లో ఉన్నవారు అంతా టెన్షన్‌తో చూస్తుండిపోయారు. చివరకు ఇదంతా అల్లరి మూకలకు హెచ్చరికగా పోలీసులు చేపట్టిన మాబ్ డ్రిల్ అని తెలియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు : ఎస్పీ

'జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ఎంతో ప్రశాంతంగా ముగిశాయి. కౌంటింగ్ ఈనెల 4వ తేదీన జరుగనుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాంతి భద్రతల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాం. కౌంటింగ్ రోజు ఓడిపోయిన వారు ఉద్రిక్తతకులోనై అల్లర్లకు పాల్పడితే సహించేది లేదు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే లాఠీ ఛార్జీచేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం, ఆతర్వాత ఫైరింగ్ చేయడం వంటి వాటికి పోలీస్‌శాఖ సిద్ధంగా ఉంది. అవసరమైన వాటికి ముందే అనుమతులు పొందాం. క్రిమినల్ కేసు నమోదైతే వారు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకు పనికిరాదు. విదేశాలకు వెళ్ళడానికి పాస్‌పోర్టు లభించదు. ముఖ్యంగా తల్లి దండ్రులు ఈనెల 4వ తేదీన తమ పిల్లలను ఎక్కడికి వెళ్తున్నారు. ఏమి చేస్తున్నారనే ఆరా తీయాలి. జిల్లాలో సీఆర్పీసీ సెక్షన్ అమలులో ఉంది. ఇద్దరు ముగ్గురు కలిసి తిరగకూడదు. ఎవరైనా అల్లర్లకు పాల్పడినా అల్లర్లకు ప్రేరేపించినా వారిపై క్రిమినల్ కేసులతో పాటు కఠిన చర్యలు తీసుకుంటాం'.. అంటూ జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి మాబ్ ఆపరేషన్ అనంతరం మీడియాకు వెల్లడించారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ జి స్వరూపరాణి, డీఎస్పీ ఈ శ్రీనివాసులు, ఏఆర్ఆర్ఐ పవన్‌కుమార్, సీఐలు ఎన్.రాజశేఖర్, ఎం. ప్రభాకర్, కె.శ్రీనివాసరావు, ఆర్ఎస్ఐ నరేంద్ర పలువురు పాల్గొన్నారు.



• తొమ్మిదిచోట్ల కార్డన్ సెర్చ్

ఏలూరు క్రైం, మే 22 : సార్వత్రిక ఎన్నికల అనంతరం జిల్లాలో శాంతి భద్రతలు కాపాడేందుకు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి జారీ చేసిన ఉత్తర్వులతో పోలీస్ యంత్రాంగం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. దీనిలో భాగంగా బుధవారం ఉదయం తొమ్మిది ప్రాంతాల్లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. 19 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పద ప్రాంతాల్లో ఈ తనిఖీలు కొనసాగుతాయని ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు.

కృష్ణబాబుకు కన్నీటి వీడ్కోలు


నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావుకు బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల అశ్రునయనాల మధ్య తుది వీడ్కోలు పలికారు. అనారోగ్యంతో మంగళవారం హైదరాబాద్‌లో మృతి చెందగా ఆయన భౌతిక కాయానికి బుధవారం దొమ్మేరులో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కన్నీటి పర్యంతమయ్యారు.

రద్దీ వేళల్లో రైళ్ల రద్దు



పలు రైళ్లు అలస్యంగా..

ప్రయాణికులకు అవస్థలు

నరసాపురం, మే 22: వేసవి సెలవులంటే ప్రయా ణాలు, స్కూళ్లు, కాలేజీలకు సెలవులు కావ డంతో చాలామంది సొంత ఊళ్లు, తీర్థయాత్రలకు వెళుతుంటారు. ఈ కారణంగా ఏప్రిల్, మే నెలల్లో బస్సులు, రైళ్లు రద్దీగా ఉంటాయి.ఈ సీజన్‌లో రైల్వే కొన్ని ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను కూడా నడుపుతుంటుంది. అయితే ఈసారి కొన్ని ప్రాంతాలకు వెళ్లే రైళ్లను రద్దు చేయడంతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు. దీనికితోడు ఈ రద్దీ సమయాల్లోనే కొన్ని రూట్లలో రైల్వే నిర్వహణ పనులు చేపట్టింది. ఈ కారణంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లు మూడు నుంచి నాలుగు గంటలు ఆలస్యంగా నడుస్తున్నాయి. రైల్వే తీసుకున్న ఈ నిర్ణయాల వల్ల ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రధానంగా జిల్లా నుంచి నడిచే రైళ్లలో గుంటూరు, విజయవాడ , రాజమండ్రి, నిడదవోలు వెళ్లే రైళ్లు ఫుల్‌గా ఉంటాయి. చాలామంది బస్సుల కన్నా డెమో రైళ్లలో గమ్యస్థానాలకు వెళ్లుతుంటారు. అయితే ఈనెల 15 నుంచి నరసాపురం- గుంటూరు పాస్ట్, నరసాపురం విజయ వాడ, నరసాపురం- నిడదవోలు, రాత్రి నరసాపురం నుంచి వెళ్లే రాజమండ్రి వెళ్లే రైళ్లను రద్దు చేసింది. దీంతో ఉదయం పూట డెల్టా నుంచి విజయవాడ వెళ్లాలంటే 11 గంటలకు నాగర్ సోల్ ఎక్స్‌ప్రెస్ ఒక్కటే దిక్కయింది. ఇక నిడదవోలు వైపు వెళ్లే రైళ్లు లేక పోవడంతో నరసాపురం నుంచి భీమవరం, తణుకు, నిడదవోలు వెళ్లే ప్రయాణికులు బస్సులపై ఆధారపడాల్సి వచ్చింది. విజయవాడ, నిడదవోలు డివిజన్లలో రైల్వే నిర్వహణ పనులు చేపడుతున్నందున చాలా రైళ్లను ఈ రూట్లలో ఈనెల 26 వరకు, మరికొన్నింటిని నెలాఖరు వరకు రద్దుచేసింది. ప్రధానంగా ఉదయం విజయవాడ- గుంటూరు వెళ్లేందుకు జిల్లా వాసులు ఎక్కువగా గుంటూరు పాస్ట్ ప్యాసింజర్‌పైనే ఆధారపడుతుంటారు. ఇటు వ్యాపారులు, ఉద్యోగస్తులు, ఆస్పత్రులకు, విజయవాడ నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఈ ఎక్స్‌ప్రెస్‌ను ఆశ్రయిస్తారు. తిరుగు ప్రయాణంలో కూడా ఈ రైలు ఎంతో అనుకూలంగా ఉంటుంది.ఇవేమీ పరిగణలోకి తీసుకోకుండా ఉదయం వేళల్లో జిల్లా నుంచి విజయవాడ వైపు వెళ్లే రైళ్లను దక్షణ మధ్య రైల్వే రద్దు చేసింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రద్దీ సమయాల్లో రైళ్లను రద్దు చేయడం వల్ల ప్రయాణికులు పడుతున్న ఇబ్బందుల్ని నరసాపురం, పాలకొల్లు, భీమవరం, ఉండి, ఆకివీడు ప్రాంతాల నుంచి పలు సంఘాలు రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కనీసం ఉదయం 6 గంటలకు నరసాపురం నుంచి నడిచే పాస్ట్ ప్యాసింజర్‌ను నడపాలని కోరారు. అయినా రైల్వే స్పందించలేదు. నిర్వహణ పనుల పేరుతో వినతుల్ని పక్కన పెట్టింది.

నరకం చూపిస్తున్న నాగర్ సోల్

నరసాపురం-షిర్డీల మధ్య నడిచే నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకు నరకం చూపిస్తున్నది. ఈ రైలులో ప్రయాణించాలంటే 30 గంటలు పడుతోంది. వారం రోజుల నుంచి ఈ రైలు ఆలస్యంగా నడుస్తోంది. ఉదయం 8.30కి రావాల్సిన ఈ రైలు మధ్యాహ్నం 1 లేదా 3 గంటలకు వస్తోంది. మహారాష్ట్రలోని పలు డివి జన్లలో మరమ్మతు పనులు చేపడుతున్నందున ఎక్కడ బడితే అక్కడ గంటల తరబడి నిలిపేస్తున్నారు. దీంతో ఈ రైలు సికింద్రాబాద్‌కు రాత్రి 11 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 4, 5 గంటలకు చేరుతోంది. అక్కడ నుంచి నరసాపు రానికి మధ్యాహ్నానికి చేరుకుంటోంది. రద్దీ సమయాల్లో రైల్వే ప్రత్యేక రైళ్లను నడ పాల్సిందిపోయి నిర్వహణ పనులు చేపట్టడంపై ప్రయాణికులు దుమ్మెత్తిపోస్తున్నారు.



స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి ఆదేశాలు ఇస్తున్న ఐజీ అశోక్‌కుమార్

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన ఐజీ

ఏలూరు క్రైం, మే 22 : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ పూర్తి అయ్యేవరకూ నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సమర్థవంతంగా విధులను నిర్వర్తించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏలూరు జిల్లాలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల ఎన్నికల ఈవీఎం బాక్స్‌లను, ప్యాడ్‌లను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. బుధవారం ఐజీ అశోక్‌కుమార్ స్ట్రాంగ్ రూమ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో 144 సీఆర్‌పీసీ సెక్షన్, పోలీస్ యాక్టు 30 అమలులో ఉన్నందున సీఆర్ఆర్ కాలేజీ చుట్టు పక్కల ప్రాంతాలకు ఏ ఒక్కరిని రానివ్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మూడంచెల భద్రత నడుమ బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూములలో భద్రపర్చడం జరిగిందని పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో 24 గంటలు బందోబస్తు నిర్వహిస్తున్నారన్నారు. సీసీ కెమెరాలపై నిరంతర పర్యవేక్షణ జరుగుతుందని తెలిపారు. ప్రతి స్ట్రాంగ్‌రూమ్, వాటి పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో పోలీసు అధికారులు ఆకస్మిక తనిఖీ చేపడుతూ అప్రమత్తం చేయాలని ఐజీ ఆదేశాలు జారీ చేశారు. ఐజీతో పాటు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి పలువురు అధికారులు ఉన్నారు.

ఏపీ నిట్‌లో పీహెచ్‌డీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిగూడెం అర్బన్, మే 22 : ఏపీ నిట్‌లో 2024-25 కు సంబంధించి పీహెచ్‌డీ (ఫుల్‌టైం, ఆఫ్‌టైం ఇంటర్ ఇస్సిప్లినరి కోర్సులకు) అర్హులైన అభ్యర్థులు అన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని డీన్ అకడమిక్ డాక్టర్ టీ.కురుమయ్య బుధ వారం తెలిపారు. ఫుల్‌టైం అభ్యర్థులు మాస్టర్ డిగ్రీతో పాటే గేట్‌లో తప్పనిసరిగా అర్హత సాధించాలన్నారు. పార్ట్ టైం అభ్యర్థులు మాస్టర్ డిగ్రీతో పాటు ఏదైనా అకడమిక్ ఇనిస్టిట్యూట్‌లో గాని, పరిశ్రమలో గాని రెండు సంవత్సరాలు పనిచేసిన అనుభవం ఉండాలన్నారు. అర్హులైన వారు ఈనెల 31 వ తేదీ లోగా అన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులను రాత పరీక్ష, ముఖాముఖీ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు www.nitandhra.ac.in సంప్రదించాలని నిట్ అడ్మిషన్ల అధికారి డాక్టర్ తపస్ తెలిపారు.

కల్యాణ వైభోగమే

కన్నుల పండువగా ద్వారకాతిరుమల చినవెంకన్న కల్యాణం

ద్వారకాతిరుమల, మే 22: అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు.. సర్వ జగద్రక్షకుడు అయిన ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి కల్యాణం బుధవారం కన్నుల పండవగా జరిగింది. శ్రీవారు సర్వాభరణ భూషితుడై నుదుటున కల్యాణ తిలకం. బుగ్గన చుక్కలతో సిగ్గులొలుకుతున్న అలివేలు మంగ, ఆండాళ్ దేవేరులను పరిణయమాడారు. ఈ కమనీయ కల్యాణ వేడుకల్లో స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని వీక్షించిన భక్తజనులు తరించారు. భక్తులు గోవిందా..గోవిందా అంటూ భక్తి పారవశ్యంలో మునిగారు. రాత్రి తొళక్క వాహనంపై శ్రీవారు, అమ్మవార్ల కల్యాణమూర్తులను ఉంచి అలంకరించి ఆలయ అనివేటి మండపంలో ఏర్పాటు చేసిన వేదిక దగ్గరకు తీసుకువచ్చారు. వేదికను పచ్చి పూలతో శోభాయమానంగా అలంక రించారు. వేదికపై ఉంచిన బంగారు సింహాసనంపై కల్యాణమూర్తులను ఉంచి అలంకరించి అర్చకులు కల్యాణతంతు ప్రారంభించారు. పాంచాహ్నిక దీక్షతో వైఖానస ఆగమాన్ని అనుసరించి జరిగిన ఈ కల్యాణ తంతులో భాగంగా ఆలయ అర్చకులు ముందుగా శాంతి హోమాన్ని జరిపి సర్వదేవ తారాధన, సంకల్పం, కంకణపూజలు నిర్వహించారు. సుముహూర్త సమ యంలో జీలకర్ర, బెల్లం ధరింపచేసి భక్తుల గోవిం దనామ స్మరణల నడుమ మాంగల్యధారణ, తలంబ్రాలు వైభవోపేతంగా జరిపించారు. ఆలయ చైర్మన్ ఎస్‌వీ సుధాకరరావు దేవస్థానం తరపున పట్టు వస్త్రాలను అందజేశారు. అర్చకులు మధుపర్కాలను సమర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తీసుకువచ్చిన పట్టువస్త్రాలు ఆలయ అధికారులకు అందిం చారు.ఈవో వేంద్ర త్రినాథరావు,ఈఈ భాస్కర్ పర్యవేక్షించారు.

సింహవాహనంపై ఊరేగిన శ్రీవారు

సింహవాహనంపై ఉభవ దేవేరులతో కొలువైన ఆ దేవదేవుడు బుధవారం ఉదయం క్షేత్ర తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఆలయ ప్రాంగణములో మూర్తులను సింహవాహనంపై ఉంచి అర్చకులు పూలతో అలంకరించారు. నీరాజనాలు సమర్పించారు. అట్టహాసంగా తిరువీధులకు తరలివెళ్లిన స్వామి, అమ్మవార్లను భక్తులు కొలిచారు. దుష్టజన సంహారానికి, భక్తజన సంరక్షణకు సంకేతంగా స్వామి సింహవాహనంపై ఊరేగారు.



వాహనంపై కల్యాణ వేదిక వద్దకు వస్తున్న స్వామివారు

జగన్మోహినిగా...శ్రీవారు.

అపురూప లావణ్యాలను ఒలికిస్తూ మోహినీ అలంకారంలో శ్రీవారు బుధవారం భక్తజనులకు దర్శనమిచ్చారు. క్షీరసాగర మదనంలో ఉద్భవించిన అమృతాన్ని దేవ, దానవులకు పంచేందకు శ్రీమహావిష్ణువు స్త్రీ రూపంలోకి మారారు. ఈ రూపంలో ఉన్న స్వామివారిని భక్తులు దర్శించి తరించారు.



స్వామి, అమ్మవార్ల కల్యాణమూర్తులకు హారతులిస్తున్న అర్చకులు



స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు తీసుకువస్తున్న చైర్మన్, ట్రస్టీ, ఈవోలు



జగన్మోహిని అలంకరణలో శ్రీవారు

కృష్ణబాబుకు కన్నీటి వీడ్కోలు

స్వగ్రామం దొమ్మేరులో అంత్యక్రియలు

రెండు తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన మిత్రులు, మంత్రులు, రాజకీయ నేతలు

ఆయన లేనిలోటు తీరనిదంటూ ప్రముఖుల నివాళులు



కొవ్వూరు మండలం దొమ్మేరులో కృష్ణబాబు అంతిమయాత్ర

కొవ్వూరు, మే 22: బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల అశ్రునయనాల మధ్య కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబుకు ప్రజానీకం తుది వీడ్కోలు పలికింది. మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ పారిశ్రామికవేత్త, దొమ్మేరు జమిందారు పెండ్యాల వెంకట కృష్ణారావు మంగళవారం హైదరాబాద్‌లో అనారోగ్య కారణాలతో కన్నుమూసిన సంగతి తెలిసిందే. కృష్ణబాబు భౌతికకాయాన్ని మంగళవారం రాత్రి పది గంటలకు కొవ్వూరు మండలం దొమ్మేరు స్వగ్రామా నికి తీసుకువచ్చారు. అప్పటి నుంచి బుధవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు అభిమానులు, కార్యకర్తల సందర్శనార్థం ఉంచారు. తమ స్నేహితుడిని కడసారి చూసుకునేందుకు అటు తెలంగాణ, ఇటు ఆంధ్రా ప్రాంతాల నుంచి నాయకులు పోటెత్తారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా అభిమా నులు, కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో కొవ్వూరు నియోజకవర్గం దొమ్మేరు గ్రామం జనంతో నిండిపోయింది. కృష్ణబాబు భౌతికకాయాన్ని చూసి చాలామంది కన్నీటిపర్యంతమయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన కృష్ణబాబు స్నేహితులు, మంత్రులు, ఎమ్మెల్యేలు కృష్ణ బాబు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణబాబు సోదరులు నరేంద్రనాథ్ చౌదరి, అచ్చిబాబులను పరామర్శించారు. మధ్యాహ్నం మూడు గంటలకు అంతిమయాత్ర ప్రారంభమైంది. దొమ్మేరు గ్రామంలోని రాష్ట్ర రహదారి పక్కన ఉన్న వారి పొలాల్లో కృష్ణబాబు కుమా రుడు రవిబాబు దహన సంస్కారాలు నిర్వహించారు. కృష్ణబాబు మృతి వార్త తెలిసిన వెంటనే విచ్చేసిన పలువురు ప్రముఖులు, పార్టీలకతీతంగా దొమ్మేరు విచ్చేసి కృష్ణబాబు సోదరులు ది ఆంధ్రసుగర్స్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనే జింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్‌చౌదరి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు)లతోపాటు కృష్ణబాబు కుటుంబ సభ్యులను కలిసి సంతాపం వ్యక్తంచేశారు. కృష్ణబాబు చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులు అర్పించి వారిలో తెలంగాణ వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, మాజీ మంత్రులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, వడ్డే శోభనాదీశ్వరరావు, పీతాని సత్యనారా యణ, ఆనం రామనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, గంటా మురళి, జొన్నకూటి బాబాజీరావు, ఎమ్మెల్యేలు జి.శ్రీనివాసనాయుడు, జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, జన సేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, నన్నపనేని రాజకుమారి, బోళ్ల రాజీవ్, అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, ద్విసభ్య కమిటీ సభ్యులు కంత మని రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మాజీ జడ్పీ చైర్మన్లు ముళ్లపూడి బాపిరాజు, ఇమ్మణి రాజేశ్వరి, నాయకులు ఆళ్ల హరిబాబు, కోడూరి శివరామకృష్ణ, సూరపనేని చిన్ని సూర్యదేవర రంజిత్, మద్దిపట్ల సురేష్, కేవీకే రంగారావు,కుందుల సత్యనారాయణ, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, అల్లూరి విక్రమాదిత్య, కొవ్వూరు పట్టణ, మండల టీడీపీ అధ్యక్షులు దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకులు మండవ లక్ష్మణరావు, మద్దిపాటి నాగేశ్వరరావు, దేవీ సీఫుడ్స్ డైరెక్టర్ పొట్లు బ్రహ్మా నందం, శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, కొవ్వూరు, తణుకు, సగ్గొండలలోని ఆంధ్రసుగర్స్ గ్రూపు సంస్థల ఉద్యోగులు, సిబ్బంది, జిల్లా నలుమూలల నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన, వైసీపీ, కాంగ్రెస్ నాయ కులు, కార్యకర్తలు అధికసంఖ్యలో దొమ్మేరు చేరుకుని కృష్ణబాబుకు నివాళులు అర్పించారు. అంతిమయాత్రలో కృష్ణబాబు సోదరులు ది ఆంధ్రసుగర్స్ లిమి టెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్‌చౌదరి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు), కృష్ణబాబు ఇద్దరు కుమారులు వెంకట్రాయుడు, రవిబాబు (ఎండీ విభాస్ పోలిమర్స్), కుమార్తె అర్చన అల్లుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, నవభారత్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ బోళ్ల రాజీవ్, కృష్ణబాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



కృష్ణబాబు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అభివృద్ధి కోసమే తపించేవారు : మంత్రి తుమ్మల

కొవ్వూరు, మే 22: కృష్ణబాబుతో తనకు అవినాభావ సంబంధం ఉండే దని, ఎప్పుడూ నియోజకవర్గ అభివృద్ధికోసమే పరితపించేవారని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కృష్ణబాబు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ కృష్ణబాబు మరణం నియోజకవర్గానికి తీరనిలోటన్నారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ఆయన శాసనసభ్యునిగా కొనసాగిన కాలంలో చేపట్టార న్నారు. హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా ప్రజాసేవలో ఉండి మచ్చలేని నాయకుడిగా కృష్ణబాబు నిలిచారన్నారు. కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించుకుంటారన్నారు. ప్రజల హృదయాల్లో ఆయన చిరస్మరణీయుడిగా ఉంటారన్నారు. నెల్లూరు జిల్లా వెంకటగిరి శాసనసభ్యుడు ఆనం రామనారా యణరెడ్డి మాట్లాడుతూ కృష్ణబాబు స్నేహానికి ప్రాణం ఇచ్చేవారని, నాలుగు దశాబ్దాలుగా ఇద్దరం ఎంతో సన్నిహితంగా మెలిగామని, ఆయన లేనిలోటు తీరనిదని పేర్కొన్నారు.



భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన శ్రీనివాసనాయుడు, తలారి వెంకట్రావు, గూడూరి శ్రీనివాస్, తానేటి వనిత, ఆనం రామనారాయణరెడ్డి, పితాని సత్యనారాయణ, ఆరిమిల్లి రాధాకృష్ణ, కృష్ణబాబు సోదరుడు, ఆంధ్రాసుగర్స్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ నరేంద్రనాథ్ చౌదరి



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఇమ్మణి రాజేశ్వరి, కందుల దుర్గేష్

క్రైం కార్నర్

బైక్‌పై నుంచి పడి మోటార్ సైక్లిస్ట్ మృతి



మృతిచెందిన భాస్కర్

ఏలూరు క్రైం,మే 22 :మోటారు సైకిలిస్టుకు ఒక వృద్ధుడు రోడ్డు దాటుతూ ఒక్కసారిగా అడ్డు రావడంతో మోటారు సైకిల్ అదుపుకాక వృద్ధుడిని ఢీకొని పడిపోయాడు. తీవ్ర గాయాలకు గురైన ఇద్దరిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మోటారు సైకిలిస్టు మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఉయ్యూరుకు చెందిన భాస్కర్‌కు (40) పని మీద ఏలూరు వచ్చి తిరిగి మోటారు సైకిల్‌పై విజయవాడ వైపు జాతీయ రహదారిపై వెళ్తుండగా బుధవారం సాయంత్రం పెదపాడు మండలం కలపర్రు గ్రామం వద్ద ఆ గ్రామానికి చెందిన యజ్జవరపు సత్యనారాయణ (80) హనుమాన్ జంక్షన్ వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతున్నాడు. అదే సమయంలో భాస్కర్ మోటారు సైకిల్ అతివేగంగా వచ్చి అతనిని ఢీకొట్టడంతో ఇద్దరూ పడి పోయారు. తీవ్ర గాయాలవడంతో ఇద్దరినీ ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.వైద్యులు పరీక్షించి అప్పటికే భాస్కర్ మృతి చెందాడని నిర్ధారించారు.సత్యనారాయణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా కేసు నమోదు చేసి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



భీమవరం క్రైం, మే 22 : భీమవరం రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో భీమవరం జంక్షన్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం-1పై ఊరు, పేరు తెలియని సుమారు 50 సంవత్సరాల వయసు గల వ్యక్తి సిమెంట్ బెంచ్‌పై పడుకొని మరణించినట్లు భీమవరం రైల్వే ఎస్‌ఐ రమణ బుధవారం తెలిపారు. తెలుగు రంగు కట్ బనియన్ ధరించి ఉన్నాడన్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఫోన్ నంబర్ 70939 39777 కు తెలియజేయాలన్నారు.

కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య

పెదవేగి, మే 22 : దీర్ఘకాలంగా వస్తున్న కడుపునొప్పిని తట్టుకోలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్టు పెదవేగి ఎస్‌ఐ బి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. పెదవేగి మండలం ముండూరు శివారు బొడ్డువారిగూడేనికి చెందిన బడుగు ధనలక్ష్మి(40) చాలాకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. బుధవారం నొప్పి తట్టుకోలేక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృత దేహాన్ని శవపరీక్షకు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు. ధనలక్ష్మి మృతిపై గ్రామస్థులు అనుమానాలు లేవనెత్తుతున్నారు. మృతురాలి కుమారుడు సాయి ఇచ్చిన ఫిర్యాదుతో అనుమానాస్పద మృతి కింద కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

మద్యం తాగొద్దన్నందుకు భర్త ఆత్మహత్య

భీమడోలు, మే 22 :భీమడోలు మండలం ఎంఎంపురం గ్రామానికి చెందిన గేశ్వరరావు మనస్తాపంతో (52) ఆత్మహత్య చేసుకున్నకట్టు భీమడోలు పోలీసులు తెలిపారు. మద్యానికి బానిసై అనారోగ్య సమస్యలతో బాధప డుతున్నాడని దీనిపై భార్య మద్యం తాగవద్దని మందలించడంతో మన స్థాపానికి గురై గుళికలు తిని అస్వస్థతకు గురైన నాగేశ్వరరావును ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అయి భీమవరంలో నెమిలి



స్వాధీనం చేసుకున్న అటవీ సిబ్బంది

ఆకివీడు, మే 22: ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు గానీ అదుపు తప్పి వచ్చిన నెమిలిని ఆకివీడు మండలం అయి-భీమవరం దిలాస్ ప్రాంతంలో కుక్కలు తరుము తుండడంతో పిల్లలు చూసి స్థానికులకు తెలిపారు. సమీపంలో ఉన్న స్థానికుడు కోడల్లి ప్రసాద్ ఆ నెమిలిని పట్టుకొని పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. ఎస్‌ఐ బత్తిన నాగబాబు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. భీమవరం సెక్షన్ అటవీశాఖ అధికారి వచ్చి నెమిలిని స్వాధీనం చేసుకున్నారు. గురువారం అడవిలో వదలి పెడతామన్నారు.

కూల్‌డ్రింక్స్ తయారీ కేంద్రంపై విజిలెన్స్ దాడులు

భీమవరం క్రైం, మే 22 : భీమవరం పట్టణంలో అనుమతులు లేకుండా సాఫ్ట్ డ్రింక్స్ తయారు చేస్తున్న గొడౌన్‌పై విజిలెన్స్ అధికారులు దాడి చేశారు. పట్టణంలో గోతం సుధీర్‌బాబు సాంబశివ సాఫ్ట్ డ్రింక్స్ తయారీ కేంద్రంలో అనుమతులు లేకుండా లెమన్ సాఫ్ట్ డ్రింక్స్‌ను పెద్ద మొత్తంలో తయారు చేసి వాటిని సీసాలలో భారీ ఎత్తున నిల్వ చేసి వాహనాల్లో చుట్టు పక్కల పట్టణాలు, గ్రామాలకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించినట్లు విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ విల్సన్‌లు చెప్పారు. బుధవారం వచ్చిన సమాచారం ప్రకారం రీజనల్ విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ అధికారి కరణం కుమార్ ఆదేశాల ప్రకారం తనిఖీలు నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు. వాడుతున్న ఎసెన్సు, ఇతర సామాగ్రిని తనిఖీ చేయగా కూల్ డ్రింక్స్ తయారు చేయడానికి ఏవిధమైన అనుమతులు లేనట్లు గుర్తించి వాటికి సంబంధించిన నమూనాలు సేకరించి ఫుడ్ పరీక్షా కేంద్రానికి పంపించామ న్నారు. తూనికలు, కొలతలకు సం బంధించిన అనుమతులు కూడా లేనట్లు గుర్తించి సంబంధిత సెక్ష న్‌ల ప్రకారం కేసు నమోదు చేశా మన్నారు. తనిఖీలలో ఫుడ్ సేఫ్టీ అధికారి సుందరరామిరెడ్డి, తూని కలు కొలతలు అధికారి రాంబాబు పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ విల్సన్



ఫుడ్ వేస్ట్ వాహనాలు సీజ్

నిడమర్రు మే 22 : తోకలపల్లిలో గల చేపల చెరువుల పెంపకందారులకు నిబంధనలకు వ్యతిరేకంగా సరఫరా చేస్తున్న రెండు ఫుడ్ వేస్ట్ వాహనాలను మంగళవారం అర్ధరాత్రి దాడులు చేసి అదుపులోకి తీసుకొన్నట్లు నిడమర్రు ఎస్.ఐ ఆర్.శ్రీను తెలిపారు. దాడులలలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి, రెండు వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.


ఏలూరులో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

జిల్లాలో వాహనాలు తనిఖీ చేసిన పోలీసులు

ఏలూరు క్రైం, మే 22: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ జూన్ 4 వరకూ అమలులో ఉండడంతో పోలీస్ శాఖ జిల్లా వ్యాప్తంగా తనిఖీ నిర్వహిస్తోంది. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికారులు రాత్రివేళ ముమ్మర గస్తీ నిర్వహిస్తున్నారు. మరోవైపు రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారి, రాష్ట్రీయ రహదారిలో వెళ్లే వాహన డ్రైవర్లకు ఫేష్‌వాష్ నిర్వహిస్తున్నారు. ప్రధాన నగరాల్లో పోలీసు గస్తీ నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తులను విచారిస్తున్నారు. లాడ్జీలను కూడా తనిఖీ చేస్తున్నారు. జిల్లాలో శాంతియుత వాతావరణాన్ని కొనసాగించడానికి పోలీస్ పికెట్లను, ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈవీఎంలను ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచన నేపథ్యంలో అక్కడ మూడంచెల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. కాలేజీ చుట్టు పక్కలకు ఎవరూ రాకూడాదని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. నేర నియంత్రణకు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు.

జంతు సంరక్షణ ప్రత్యేకాధికారిగా డీఎస్పీ ప్రభాకరరావు


కె.ప్రభాకరరావు

ఏలూరు క్రైం, మే 22: జంతురక్షణ సంబంధిత ప్రత్యేక పర్యవేక్షణాధికారిగా పెదవేగి డీటీసీ డీఎస్పీ కె ప్రభాకరరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలపై జంతు సంక్షేమ బోర్డు జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి జంతువుల అక్రమ రవాణా, జంతు వధను నిరోధించడానికి జిల్లాకు ఒక నోడల్ అధికారిని నియమించారు. హైకోర్టు ఆదేశాలు, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు అధికారులను నియమించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి చట్టపరమైన చర్యలు తీసుకునేలా నోడల్ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయానికి అందాయని ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు. జంతువుల అక్రమ రవాణా, గోవధపై ప్రజలు సమాచారాన్ని ఏలూరు జిల్లా నోడల్ అధికారి కె.ప్రభాకరరావు సెల్ నెంబర్ 9440404010కు సమాచారం అందించాలని ఎస్పీ మేరీ ప్రశాంతి సూచించారు.

'సత్యసాయి' కార్మికులకు వేతనాలు చెల్లించాలి


వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ఏలూరు టూటౌన్, మే 22: సత్యసాయి మంచినీటి పథకం కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం జడ్పీ సీఈవో సుబ్బారావుకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 120 గ్రామాల్లో 5 లక్షల మందికి తాగునీటిని సరఫరా చేస్తున్న 100 మంది కార్మికులకు ఈ ఏడాది జనవరి నుంచి జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గం అన్నారు. కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. లైన్‌మన్, ఆపరేటర్లు, ఫిట్టర్లు, ఎలక్ట్రీషియన్లు, వాచ్‌మన్ విధులు నిర్వహిస్తున్నారన్నారు. జీతాలు చెల్లించాల్సిన కాంట్రాక్టర్ ఐదు నెలలుగా ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎంఆర్ఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, భాస్కరరావు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు గాలికొదిలేసిన ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న రవి

ఏలూరు టూటౌన్, మే 22: ఎన్నికల పేరుతో ప్రజా సమస్యలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో రామకృష్ణ అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. రవి మాట్లాడుతూ జిల్లాలో ఏజెన్సీ ప్రాంతంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. శుభ్రమైన తాగునీరు అందక గిరిజనులు అతిసార, విషజ్వరాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అంబులెన్స్‌లు మూలనపడటంతో గిరిజనులకు సరైన వైద్యం అందడం లేదన్నారు. ఉపాధి బకాయిలు చెల్లించకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అకాల వర్షాలకు మామిడి, వరి, కూరగాయల పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారన్నారు. పట్టణ ప్రాంతంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, దోమలు, తదితర సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారామ్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ పేరుతో ప్రభుత్వం పాలనను గాలికి వదిలేసిందన్నారు. కార్యక్రమంలో జి.నరసింహరావు, కిశోర్, కె.శ్రీనివాస్, జీవరత్నం, వెంకట్రావు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం


రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు

కామవరపుకోట, మే 22: ప్రకృతి వ్యవసాయం రైతులకు మంచి లాభదాయకమని ఇంజనీరింగ్ అధికారి ప్రసాద్ సూచించారు. మండలంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల ద్వారా పండించిన పంటలతో ప్రజలు రోగాల బారిన పడి ఆసుపత్రులపాలవుతున్నారని అన్నారు. ప్రతీ కుటుంబం కూడా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించాలని, తద్వారా రైతులకు ఆదాయం అభివృద్ధి చెందుతుందన్నారు. భూసారం పెరుగుతుందని, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి ఎస్‌కె. హుస్సేన్‌బీ, సిబ్బంది ఉన్నారు. రైతు సోదరులు దారా ప్రసాద్, కొర్రి మల్లయ్య, జయరాజు, రాములమ్మ, జ్యోతి, నాగమణి, వెంకాయమ్మ, నాగేశ్వరరావు, సీతారాముడు, రమేష్ తదితరులు ఉన్నారు. వివిధ పంటల దిగుబడులను వివరించారు.

'బీసీ బాలికల వసతి గృహ భవన నిర్మాణం చేపడతాం'

ఏలూరు కలెక్టరేట్, మే 22: ఏలూరులోని బీసీ బాలికల వసతిగృహం -1 భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని, మనబడి, నాడు - నేడు సెకండ్ ఫేజ్‌లో అనుమతి వచ్చిన వెంటనే భవన నిర్మాణం చేపడతామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఆర్.వి నాగరాణి తెలిపారు. శిథిలావస్థలో ఉన్న బాలికల వసతిగృహం-1 భవనం తొలగించి నూతన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. అనుమతి వచ్చిన వెంటనే భవన నిర్మాణం చేపడుతున్నామన్నారు. అంతవరకు ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న భవనం పక్కనే వసతిగృహంలో విద్యార్థులకు అన్ని వసతులు కలిగిన భవనంలో అన్ని సౌకర్యాలతో నిర్వహించనున్నట్లు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనంలో విద్యార్థులు ఎవరూ ఉండడం లేదని ఆమె తెలిపారు.

పర్సా జీవితం కార్మిక వర్గానికి అంకితం

ఏలూరు టూటౌన్, మే 22: కార్మికుల హక్కుల రక్షణకై పోరాడిన పర్సా సత్యనారాయణ జీవితం కార్మిక వర్గానికి అంకితం చేశాడని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీతారామ్ అన్నారు. సీపీఎం కార్యాలయంలో సత్యనారాయణ వర్థంతి కార్యక్రమం లింగరాజు అధ్యక్షతన బుధవారం జరిగింది. ముందుగా పర్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతారాం మాట్లాడుతూ సింగరేణి బొగ్గు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడారన్నారు. విశాఖ ఉక్కు ఉద్యమంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో డీఎన్‌వీడీ ప్రసాద్, సోమయ్య, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గుక్కెడు నీరివ్వండి..!

దొరసానిపాడులో తాగునీటి తిప్పలు
రాజకీయ కక్షలే కారణం!


నీరివ్వాలంటూ ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ద్వారకాతిరుమల, మే 22: గుక్కెడు మంచినీరివ్వండి మహాప్రభూ.. అని మొత్తుకుంటున్నా రాజకీయ కక్షల ముందు ప్రజల తాగునీటి కష్టాలు కనిపించడం లేదు. నెల రోజులుగా పంచాయతీ కుళాయిల నుంచి తమకు మంచినీరు ఇవ్వకుండా నిలుపుదల చేశారంటూ మహిళలు బుధవారం సాయంత్రం ఆందోళనకు దిగారు. మంచినీళ్లివ్వండి అంటే మీ నాయకులను అడగండి.. అని స్థానిక ప్రజాప్రతినిధులు అంటుంటే.. మీరు పన్నులు కట్టారా.. పెండింగ్‌లు అన్నీ కట్టేయండి.. మీకు కొత్త బోరు వేయిస్తా అంటూ మరో వైపు గ్రామ కార్యదర్శి నిర్లక్ష్యధోరణి. ఇదీ మండలంలోని దొరసాని పాడు ఎస్సీ కాలనీలో గత కొద్దిరోజులుగా స్థానికుల పడుతున్న తాగునీటి కష్టాలు. రెండు,మూడు రోజులకోసారి నీరు ఇస్తే ఎలా అంటూ పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులకు తమ బాధలు చెప్పుకున్నా నిర్లక్ష్యంగా ఉంటున్నారని నీటిని సక్రమంగా అందించడం లేదని ఎస్సీ కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. దీంతో తాము సమీపంలో ఉన్న చెరువులో నీటిని వాడకానికి వినియోగించుకుంటున్నామని, అలాగే రైతులను బతిమాలి వారి వ్యవసాయ బోర్ల నుంచి నీటిని పట్టుకుని తెచ్చుకుంటున్నట్లు చెబుతున్నారు. దాదాపు అర కిలో మీటరు నడిస్తే కానీ పంచాయతీ బోరు రాదని ఒక్కోసారి అక్కడకు వెళ్లాల్సి వస్తుందని అంటున్నారు. మంచి నీటి కోసం అటు ఇటు పరుగులు తీస్తున్నామని వాపోతున్నారు. ఒక పక్క వేసవి మరో పక్క మంచినీటి ఎద్దడితో సతమతమవుతున్నామని అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

తాగడానికి చుక్క నీరు దొరకడం లేదు



మా ఇంట్లో ఎనిమిది మంది ఉన్నాం. తాగడానికి చుక్క నీరు దొరకడం లేదు. గ్రామంలో కొన్నాళ్లగా మంచినీటి కష్టాలను అనుభవిస్తున్నాం. అధికారులను అడిగితే మీకు దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ నిర్లక్ష్య సమాధానం ఇస్తున్నారు. వేసవిలో నీటికోసం పరుగులు తీస్తున్నాం. కుళాయిల ద్వారా మూడు రోజుల కోసారి కూడా తాగు నీరు ఇవ్వడం లేదు.

\- లింగంకొండ కుమారి, దొరసానిపాడు

మీ పార్టీ వాళ్లనడుగు అంటున్నారు

మంచినీరు ఇవ్వాలని ప్రజాప్రతినిధులను ప్రాధేయపడుతుంటే నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారు. మీ పార్టీ వాడు ఇస్తాడు వెళ్లి అడుగు అంటున్నారు. ఎవరినడిగేది. తాగునీరు ఎందుకు ఇవ్వరు. ఎండా కాలంలో తాగేందుకు నీళ్లురాక పిల్లలతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. అటు కార్యదర్శి, ఇటు ప్రజాప్రతినిధులెవరూ పట్టించుకోవడం లేదు. జిల్లా అధికారులు దృష్టి సారించాలి.



\-మర్రి పెద్దింట్లు, దొరసానిపాడు




ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయం, మహిళా గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, ధర్మాజీగూడెం గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరం

గ్రంథాలయాల్లో విజ్ఞాన శిబిరాలు

ఏలూరు టూటౌన్, మే 22: చిన్నారుల్లో దాగిఉన్న సృజనాత్మక శక్తిని, నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని రిసోర్స్‌పర్సన్ శ్రీవల్లి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరం బుధవారం నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు పేపర్‌క్రాఫ్ట్, గృహాలంకరణ, డెకరేషన్ ఐటమ్స్‌పై శిక్షణ ఇచ్చారు. రిసోర్స్‌పర్సన్ జి.లావణ్య జనరల్ అవేర్‌నెస్, జీకే, స్టోరీస్, స్టోరీ టెల్లింగ్, బొమ్మరిల్లు కథలు, పంచతంత్ర కథలు వివరించారు. డ్రాయింగ్ టీచర్ శంకర్ డ్రాయింగ్ మెలకువలు నేర్పించారు. ఉపాధ్యాయులు ఎండీ ఖజావల్లి ఇంగ్లీష్ భాషను నేర్పించారు. డిప్యూటీ లైబ్రేరియన్ నారాయణరావు, సతీష్, సందీప్‌కుమార్, ఎండీ అస్లాంభాష పాల్గొన్నారు.

మహిళా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం గ్రంథపాలకురాలు యాగంటి శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. రిటైర్డ్ హెచ్ఎం హిమాచలేశ్వరి విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, హిందీ భాషలో మెలకువలు నేర్పించారు. డ్రాయింగ్ టీచర్ లక్ష్మీ డ్రాయింగ్‌లో మెలకువలు నేర్పించారు. విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుని విజ్ఞానాన్ని సంపాదించుకోవాలని శ్రీదేవి అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

- లింగపాలెం: విద్యార్థుల్లో విజ్ఞానాన్ని వెలికితీసేందుకు వారిలో సృజనాత్మకత, నైపుణ్యాన్ని పెంచేందుకే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ సీహెచ్.వెంకటరమణ తెలిపారు. ధర్మాజిగూడెం, లింగపాలెం గ్రంథాలయాల్లో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించారు. విద్యార్థులకు గేమ్స్, చిత్రకళలు, నృత్యం నేర్పారు. విద్యార్థులతో నీతికథలు చదివించి కథల్లోని నీతిని వివరించారు. విద్యార్థులకు డ్రాయింగ్‌లు వేసి శిక్షణ ఇచ్చారు. ఇంగ్లీష్ గ్రామర్, మ్యాథ్స్ వంటివి త్వరగా నేర్చుకునే విధంగా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు వెంకటరమణ, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.
- భీమడోలు: వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమంలో భాగంగా భీమడోలు శాఖా గ్రంథాలయంలో జాతీయ వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు హక్కులు, బాధ్యతలు గురించి వివరించారు. గ్రంథపాలకుడు శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు. విద్యార్థులకు, భద్రత హక్కు, సమాచార హక్కు, ఎంపిక చేసుకునే హక్కు, విన్నవించుకునే హక్కు, నష్టపరిహారం పొందే హక్కు, వినియోగదారు విద్యను పొందే హక్కులపై అవగాహన కల్పించారు.

వీరబ్రహ్మంకు శిల్పకళా నైపుణ్యం అవార్డు


ఎంకేఎల్ వీరబ్రహ్మం

చింతలపూడి, మే 22: చింతలపూడికి చెందిన ఎం.కనకలింగ వీరబ్రహ్మం హైదరాబాద్‌కు చెందిన విశ్వబ్రాహ్మణ నాలెడ్జ్ సెంటర్ అవార్డుకు ఎంపిక య్యారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విశ్వబ్రాహ్మణుల నుంచి ఈ సంస్థ దరఖాస్తులు స్వీకరిస్తుంది. సంస్థ కమిటీ ఎంపిక చేసిన వారికి అవార్డులు ప్రకటిస్తారు. శిల్పాలు చెక్కడం, తలుపులపై దేవతామూర్తుల విగ్రహాలు చెక్కటం, శిల్పకళలో నైపుణ్యాలు గుర్తించి తనకు అవార్డు ప్రకటించారని వీరబ్రహ్మం తెలిపారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 26న పురస్కారాలు అందిస్తారని వీరబ్రహ్మం తెలిపారు.

ఉంగుటూరు మండలంలో చలివేంద్రాలు

ఉంగుటూరు, మే 22: ఉంగుటూరు మండలంలో పలు చోట్ల మజ్జిగ, తాగునీటి చలివేంద్రాలు కొనసాగుతున్నాయి. వేసవి తాపానికి ఉపశమనంగా కైకరం గున్నం వెంకట్రావు కాంప్లెక్స్‌లో 23 రోజు మజ్జిగ చలివేంద్రం బుధవారం కొనసాగించారు. దాతల సహకారంతో మజ్జిగ చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు సమరసత మండల కన్వీనర్ సత్యనారాయణ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు మృతికి సంతాపం

కామవరపుకోట, మే 22: కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు) మృతికి సీపీఐ నాయకులు సంతాపం తెలిపారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో కృష్ణబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కోనేరు వెంకట సుబ్బారావు, సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్.రాజు, సహాయ కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

కామవరపుకోట, మే 22: ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం గురువారం జరుగుతుందని ఎంపీడీవో స్వర్ణ భారతి తెలిపారు. సభ్యులు, అధికారులు సమావేశానికి హాజరుకావాలన్నారు.

విద్యుత్ అక్రమ వినియోగం : ఇద్దరిపై కేసు

ఏలూరు క్రైం, మే 22 : దేవరపల్లి మండలం యాదవోలులో విద్యుత్ అక్రమ వినియోగంపై ఉమ్మడి పశ్చిమగోదావరి ట్రాన్స్‌కో విజిలెన్సు ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ బుధవారం తనిఖీ చేశారు. దాంద్రు రామారావు, ప్రగడ సుబ్బారావు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అపరాధ రుసుం విధించి కేసు నమోదు చేశారు.

ఉపాధి పనుల కల్పనపై విచారణకు ఆదేశం

ఏలూరు రూరల్, మే 22: రూరల్ మండలం కోమటిలంకలో ఉపాధి హామీ పనులు కల్పించడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్, సర్పంచ్‌ను నిలదీసిన ఘటన తెలిసిందే. ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన కథనంపై స్పందించిన డ్వామా పీడీ రాము విచారణకు ఆదేశాలు జారీ చేశారు. అడిగిన వారికి పని కల్పించడం లేదని సర్పంచ్, ఫీల్డ్ అసిస్టెంట్‌ను స్థానికులు నిలదీశారు. పనిప్రదేశాల్లో వసతులు లేవని ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ చేసి నివేదిక అందజేయాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవోను డ్వామా పీడీ ఆదేశించారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

టి.నరసాపురం, మే 22: భార్యను అదనపుకట్నం కోసం వేధించిన భర్తతో పాటు అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు టి.నరసాపురం ఏఎస్ఐ జయకుమార్ తెలిపారు. వెలగపాడు పంచాయతీ వీరభద్రవరం గ్రామానికి చెందిన కాటబోయిన రాజేశ్వరికి మూడేళ్ల క్రితం సురేష్‌తో వివాహమైంది. వివాహ సమయంలో ఇచ్చిన కట్నం చాలదని, అదనపు కట్నం తేవాలంటూ కొంతకాలంగా భర్త సురేష్, అతని తల్లిదండ్రులు రాజేశ్వరిని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. రాజేశ్వరి ఫిర్యాదుతో వారి పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జయకుమార్ తెలిపారు.

విద్యుత్ స్తంభాలను ఢీకొన్న కారు

భీమడోలు, మే 22 : వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి ప్రభుత్వ ఆస్తికి నష్టం కల్గించిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. అంబర్‌పేటలో బొలెరో వాహనం విద్యుత్ స్థంభాలను ఢీకొట్టడంతో రెండు స్థంభాలు విరిగిపోయాయి. సంబంధిత అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బొలెరో వ్యాను డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ఉంగుటూరు,మే 22 : బాలిక అదృశ్యమైన విషయమై చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. తాడేపల్లిగూడెం శివారు కూనవరం గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక తాడేపల్లిగూడెం ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 12న వేసవి సెలవుల నిమిత్తం అమ్మమ్మ ఊరు వెళ్లింది. 18వ తేదీ రాత్రి నిద్రించిన బాలిక తెల్లవారు జామున అదృశ్యమైంది. బాలిక తల్లి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. బాలిక అదృశ్యంపై ఉంగుటూరు మండలం అక్కుపల్లి గోకవరం శివారు గోపరాజుపాడు గ్రామానికి చెందిన గుల్లపల్లి వెంకన్నపై అనుమానం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఏలూరు కలెక్టరేట్, మే 22: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి జూన్ 6 వరకు, పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3వరకు జరుగనున్నాయి. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అర్బన్ తహసీల్దార్ కేవీఆర్ మురార్జీ తెలిపారు. ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు నారాయణ జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజి, సీఆర్.రెడ్డి కళాశాల, చైతన్య జూనియర్ కళాశాల, సెయింట్ థెరిస్సా, ఎస్ఆర్ఐ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాల్లో జరుగుతాయి. పరీక్షలు ముగిసే వరకు 144సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఏలూరులో ఎస్ఈఎస్ డీఎం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, కస్తూరిబా, బాలికల హైస్కూల్, గాంధీనగర్, తూర్పువీధి, జెఎన్‌జె ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్, తంగెళ్లమూడి జడ్పీ హైస్కూల్, సెయింట్ థెరిస్సా, బాలికల హైస్కూల్, కేవీటీటీ హైస్కూల్, ఏఆర్‌డీజీకే హైస్కూల్ వద్ద కూడా 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో జిరాక్స్ దుకాణాలను అనుమతించకూడదని ఆయన సూచించారు.

గ్రంథాలయానికి జేఈఈ మెటీరియల్


మెటీరియల్ అందిస్తున్న సర్వేశ్వరరావు

ఉంగుటూరు, మే 22: శాఖా గ్రంథాలయానికి సీహెచ్ఎస్.సర్వేశ్వరరావు ఐఐటీ, జేఈఈ మెయిన్స్ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. తాను కెమిస్ట్రీలో సందేహాలను ఆన్‌లైన్ లేదా జూమ్ తరగతులలో నివృత్తి చేస్తానని వివరించారు. వివిధ సబ్జెక్టులలో నిష్ణాతులైన వారి కోసం లైబ్రేరియన్ సీహెచ్. గంగాధరరావును సంప్రదించాలన్నారు. తల్లాప్రగడ భీమేశ్వరరావు, పాతూరి వంశీకృష్ణ, కోసూరి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థుల వివరాలు చెబుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

56 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

చింతలపూడి, మే 22: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 56 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. డిగ్రీ 6వ సెమిస్టర్ విద్యార్థులు గత ఆరు నెలలుగా లాంగ్‌టెర్మ్ ఇంటర్న్‌షిప్ చేస్తుండగా వివిధ కంపెనీలు ఒకేసారి 56 మంది విద్యార్థులరు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. విద్యార్థుల నైపుణ్యం, ప్రతిభ, ప్రేరణ, సమర్థవంతమైన అధ్యాపకుల కృషితో ఇంత మందికి ఉద్యోగాలు లభించాయన్నారు. డిగ్రీ చదివే విద్యార్థులకు వారి కోర్సులతో పాటు ప్రత్యేకమైన వృత్తి నైపుణ్యాలు అభివృద్ధి పరచడంలో అధ్యాపకుల పాత్ర ప్రధానమైనదని పేర్కొన్నారు. గత మూడేళ్ళుగా ఈ కళాశాలలో చదివే విద్యార్థులు ఎవరు ఖాళీగా లేరని, ఏదో ఉద్యోగం సంపాదించుకుని క్రమశిక్షణతో మెలుగుతున్నారని తెలిపారు. ఆరు నెలల ఇంటర్న్‌షిప్‌లో ఒక మంచి ఉద్యోగ అవకాశంగా ఇది తమ ప్రతిభ చూపిందని, విద్యార్థుల్లోనూ తమ ఆనందాన్ని వ్యక్తం చేయటం జరిగిందని, ప్రభుత్వ కళాశాల సేవలను గుర్తించి విద్యార్థులు చేరాలని ఆయన పిలుపునిచ్చారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి : డీపీవో

జీలుగుమిల్లి, మే 22: గ్రామాల్లో పారిశుద్య పనులపై పంచాయతీ సిబ్బంది దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. దర్బగూడెం పంచాయతీలో పారిశుద్య పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలు, డ్రైనేజీ ద్వారా మురుగనీటి పారుదల, దోమల నివారణ చేపట్టే చర్యలు తాగునీటి క్లోరినేషన్ వంటి అంశాలపై రికార్డులు పరిశీలించారు. అనంతరం మంచినీటి ట్యాంకు వద్ద పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంచాయతీ సిబ్బంది ఏకరూప దుస్తులు దరించాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండాచూడాల్సిన బాధ్యత పంచాయతీ ఆరోగ్య సిబ్బందిపై ఉందన్నారు. ఈవోపీఆర్డీ నిఖిల్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సువర్ణకుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఆడమ్ ఉన్నారు.


శనివారపుపేటలో వేంకటేశ్వరస్వామి కల్యాణం

ఆధ్యాత్మికం




ఏలూరులో లక్ష్మీ నృసింహస్వామి కల్యాణం, కనకదుర్గ, వినాయకుడికి అలంకరణ


రంగాపురంలో సత్యనారాయణస్వామి కల్యాణం

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం

ఏలూరు కల్చరల్, మే 22: గోవింద నామస్మరణతో శనివారపుపేట మార్మోగింది. వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఉదయం వేదమంత్రోచ్ఛరణల మధ్య విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కంకటధారణ, అగ్నిప్రతిష్ఠాపన, మధుపర్క సమర్పణ, మహా సంకల్పం, మంగళసూత్ర ధారణ ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. సుందరంగా అలంకరించిన ప్రత్యేక వేదికపై స్వామి అమ్మవార్లను ఉంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణం చూసి తరించారు. అనంతరం నక్షత్రహారతి, మంగళహారతి కార్యక్రమంతో కల్యాణం దిగ్విజయంగా ముగిసింది. 23న సత్యనారాయణస్వామి వ్రతం జరుగుతుందని, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

శాస్త్రోక్తంగా లక్ష్మీనృసింహస్వామి కల్యాణం

ఏలూరు కార్పొరేషన్: పడమరవీధిలో అళహ సింగరప్పస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం లక్ష్మీ నృసింహస్వామి కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన జరిపారు. స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. సుదర్శన నరసింహ హోమాన్ని జరిపారు. మేళతాళాలు, బాజాభజంత్రీలు వేద మంత్రోచ్ఛరణ అశేష భక్తుల సమక్షంలో కల్యాణ మహోత్సవాన్ని జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. ఆలయ అభివృద్ధి కమిటీ కన్వీనర్ సుంకర ప్రవీణ్‌రాయల్, ఈవో డి.శంకరరావు భక్తులకు ఏర్పాట్లు చేశారు. కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయాన్ని పంచరంగుల విద్యుద్దీపాలంకరణతో తీర్చిదిద్దారు.

ఘనంగా సత్యదేవుని కల్యాణం

లింగపాలెం: రంగాపురంలో భూదేవి నీలాదేవి సహిత సత్యనారాయణ స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. సత్యనారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం అనంతరం కల్యాణ మహోత్సవం జరిపించారు. స్వామివారికి ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవం రంగాపురం, పరిసర గ్రామాల ప్రజలు తిలకించారు.

లక్ష్మీనారసింహునికి అభిషేకాలు

ద్వారకాతిరుమల: సుందరగిరిపై స్వయంభువుగా కొలువుదీరిన లక్ష్మీనారసింహునికి బుధవారం అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. నృశింహజయంతి పురస్కరించుకుని శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాధపురం ఆలయానికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. ఉత్సవ మూర్తులకు హారతులు ఇచ్చారు.

నేడు కైకరంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం

ఉంగుటూరు: కైకరం ఆరుగుళ్ళ సెంటర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం అలివేలు మంగా సమేత పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది.

కనకదుర్గ ఆలయంలో పుష్పయాగాలు

ఏలూరు కార్పొరేషన్: బావిశెట్టివారిపేట కనకదుర్గాంబ ఆలయంలో మూడు రోజులపాటు జరగనున్న పుష్పయాగాలు బుధవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారికి విశేష హారతులు ఇచ్చారు. ధ్వజారోహణ, అఖండ దీపారాధన, బలి, అగ్నిస్థాపన, దర్బార్ సేవ కార్యక్రమాలను నిర్వహించారు. కందుర్తి గోపాలకృష్ణ, యడవల్లి శ్రీహరిశర్మ పూజలు చేయించారు. ఆలయ ఈవో సీహెచ్.చిననాగేశ్వరరావు, సిబ్బంది భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

వినాయకుడికి గరిక పూజలు

ఏలూరు కార్పొరేషన్: సత్రంపాడు లక్ష్మీగణపతిస్వామి ఆలయం వద్ద భక్తులు సామూహికంగా గరిక పూజలు చేశారు. బెల్లం నివేదనలు సమర్పించారు. తొలుత ఆలయ అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించి అనంతరం విశేష అలంకరణ జరిపి ప్రత్యేక హారతులు ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని గణపతి పారాయణ నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వరసిద్ధి వినాయకుడికి అభిషేకాలు

కామవరపుకోట: స్థానిక గుర్రాలచెరువు గట్టు వద్ద వరసిద్ధి వినాయకుడి ఆలయం వద్ద బుధవారం కొబ్బరినీళ్ల, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. గరిక పూజలు చేసి బెల్లం నివేదించారు. అర్చకులు సుదర్శనం సత్య శ్రీనివాసాచార్యులు పూజలు చేయించారు.



కల్యాణ తంతును నిర్వహిస్తున్న అర్చకులు

కల్యాణ వైభోగమే

కన్నుల పండువగా ద్వారకాతిరుమల చిన వెంకన్న కల్యాణం

ద్వారకాతిరుమల, మే 22: అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు.. సర్వ జగద్రక్షకుడైన ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి కల్యాణం బుధవారం కన్నుల పండవగా జరిగింది. శ్రీవారు సర్వాభరణ భూషితుడై నుదుటున కల్యాణ తిలకం, బుగ్గన చుక్కలతో సిగ్గులొలుకుతున్న అలివేలు మంగ, ఆండాళ్ దేవేరులను పరిణయమాడారు. ఈ కమనీయ కల్యాణ వేడుకల్లో స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని వీక్షించిన భక్తజనులు తరించారు. ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు దేవస్థానం తరపున పట్టు వస్త్రాలను అందజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తీసుకువచ్చిన పట్టువస్త్రాలు ఆలయ అధికారులకు అందించారు. ఈవో త్రినాథరావు, ఈఈ భాస్కర్ పర్యవేక్షించారు.

జగన్మోహినిగా.. శ్రీవారు

అపురూప లావణ్యాలను ఒలికిస్తూ మోహినీ అలంకారంలో శ్రీవారు బుధవారం భక్తజనులకు దర్శనమిచ్చారు. క్షీరసాగర మదనంలో ఉద్భవించిన అమృతాన్ని దేవ, దానవులకు పంచేందుకు శ్రీమహావిష్ణువు స్త్రీ రూపంలోకి మారారు. ఈ రూపంలో ఉన్న స్వామివారిని భక్తులు దర్శించి తరించారు.

వికసించిన మే పుష్పాలు



నూజివీడు టౌన్, మే 22: అరుణ శోభతో నడి వేసవిలో పుష్పించే మే పుష్పాలు పలువుర్ని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. నూజివీడు మండల దిగవల్లి గ్రామంలోని దాసర రాఘవేంద్రరావు ఇంటి ఆవరణలో రెండు మే పుష్పాలు వికసించగా, మరో నాలుగు మే పుష్పాలు అంకుర దశలో ఉండి, పలువుర్ని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సాధారణంగా 40 నుంచి 45 డిగ్రీలు వేడి సమయంలో మే నెలలో ఈ మే పుష్పాలు వికసిస్తాయి. అయితే వరుస వర్షాల నేపథ్యంలోనూ వాతావరణం చల్లబడినా పుష్పాలు యథావిధిగా పూయడం విశేషం.

ప్రజాస్వామ్య ఐక్యవేదిక సభ్యత్వ నమోదు



మండవల్లి, మే 22: ప్రజలను చైతన్యపరిచి ప్రజాస్వామ్య లక్ష్యాలను సాధించే దిశగా పౌరులను తయారుచేయడమే ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక లక్ష్యమని జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు టి అప్పారావు తెలిపారు. ఈ లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యం కోసం మండ వల్లి మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వివరించా రు. బుధవారం మండవల్లిలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో 30 మందిని సభ్యులుగా నమోదు చేశారు. ప్రొఫెసర్ సుధాబత్తుల విజయ కుమా ర్‌కు తొలుత సభ్యత్వం అందించి నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వారు తెలిపారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు

కలిదిండి, మే 22 : కలిదిండి గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ముదినేపల్లి: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా బుధవారం ముదినేపల్లి లోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. కుర్చీలాట నిర్వహించటంతోపాటు పుస్తక పఠనం, కథల బోధన కార్యక్రమం కూడ జరిగింది. డిగ్రీ విద్యార్థి కె.మానస మోసకారి నక్క కథను విద్యార్థులకు వివరించి అనంతరం క్యారమ్స్, చెస్, వైకుంఠ పాళి నేర్పించారు.

క్రైం కార్నర్

బోదెలోకి దూసుకుపోయిన కారు



మండవల్లి, మే 22: మండవల్లి మండలం చావలిపాడు రైల్వే గేటు వద్ద మంగళవారం రాత్రి డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో కారు పక్కనే ఉన్న బోదెలోకి దూసుకుపోయింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదని సమాచారం. కైకలూరు వైపు నుంచి ముదినేపల్లి వైపు వెళుతున్న ఈ కారు అదుపుతప్పి ప్రమాద సూచిక బోర్డును ఢీకొట్టి బోదెలోకి దూసుకుపోయింది. కారులో ప్రయాణిస్తున్న వారి వివరాలు తెలియలేదు. కారును బోదె నుంచి బయటకు తీసి ఉంచారు. దీనిపై పోలీసులకు కూడా సమాచారం లేదని తెలిసింది.

కడుపునొప్పి తాళలేక ఒకరి ఆత్మహత్య

ఆగిరిపల్లి, మే 22: తీవ్రమైన కడుపునొప్పి తాళలేక ఆగిరిపల్లి మండలం పోతవరప్పాడు గ్రామానికి చెందిన పత్తిపాటి కోటేశ్వరరావు (58) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నెల 21న తీవ్రమైన నొప్పితో బాధపడుతూ తన మామిడి తోటలోకి వెళ్ళి పురుగుమందు తాగి ఈ విషయం తమ్ముడి కుమారుడుకి ఫోన్ చేసి చెప్పగా అతను కోటేశ్వరరావు కుటుంబసభ్యులకు విషయం తెలియచేశాడు. వారు వెంటనే అతనిని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ 22వ తేదీ ఉదయం మరణించాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేంద్రబాబు తెలిపారు.

బాలికపై బాలుడి లైంగిక దాడి

మండవల్లి, మే 22: మండలంలోని కొల్లేటిలంక గ్రామం పరిధిలో బాలికకు మాయమాటలు చెప్పి పాఠశాల ఆవరణలో బాలుడు లైంగిక దాడికి పాల్పడగా ఆ దృశ్యాలను మరికొందరు సెల్‌ఫోన్లో చిత్రీకరించారని బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటన ఈ నెల 15న జరిగిందని, వీడియో తీసిన వ్యక్తులు వాట్సాప్‌లో ఫార్వర్డ్ చేశారని, అది తెలిసి బాలికను తల్లి ఏం జరిగిందని నిలదీయడంతో విషయం చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొంది. బుధవారం మండవల్లి ఎస్సై రామచంద్రరావు కేసు నమోదు చేశారు. కైకలూరు రూరల్ సీఐ బి కృష్ణకుమార్ బాలుడిని విజయవాడ జువనైల్ హోమ్‌కి పంపించినట్లు పోలీసులు తెలిపారు. వీడియోలు తీసి ఫార్వర్డ్ చేసిన నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కైకలూరు కోర్టుకి పంపినట్లు మండవల్లి ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద వ్యక్తుల సంచారం

ఆగిరిపల్లి, మే 22: ఆగిరిపల్లిలో స్థానిక పోస్టాఫీస్ వద్ద మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంటకు ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తచ్చాడుతున్నట్లు స్థానికులు తెలిపారు. వీరు ఒంటిపై చొక్కాలు లేకుండా ఒంటినిండా ఆయిల్ రాసుకుని నల్లప్యాంట్లు ధరించి ఉన్నారని తెలిపారు. స్థానికులు 100కు కాల్ చేయగా స్థానిక నైట్ డ్యూటీ కానిస్టేబుల్ వచ్చి ఆగంతుకుల కోసం గాలించగా అప్పటికే వారు జారుకున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విలువైన వస్తువులు భద్రంగా ఉంచుకోవాలని, ఎవరిపైన అయినా అనుమానం వస్తే పోలీస్‌లకు తెలియజేయాలని ఎస్సై సురేంద్రబాబు అన్నారు.

దాడి ఘటనలో ఆరుగురి అరెస్టు

ముదినేపల్లి రూరల్, మే 22: ముదినేపల్లి మండలం ఊటుకూరులో ఇటీవల ఒక ఇంటిపై కర్రలతో దాడి చేసి ముగ్గురిని గాయపరచిన ఘటనలో ఆరుగురు నిందితులను బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై పద్మజ తెలిపారు. దాడికి పాల్పడిన పోసిన బాల కోటయ్య, గాయత్రి, సురేష్, చైతన్య, పవన్‌కుమార్‌రెడ్డి, హక్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరిని కైకలూరు కోర్టులో హాజరు పరిచినట్లు వివరించారు.

డీజిల్ లూజ్ విక్రయాల నిషేధంతో..

ఆక్వా రైతుల పాట్లు

- ఏరియేటర్లు తిప్పేదెలా అని ఆందోళన
- బంకుల్లోను తగ్గిన అమ్మకాలు

పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ లూజు అమ్మకాలపై ఎన్నికల సంఘం నిషేధం విధించటంతో ముదినేపల్లి ప్రాంతంలోని ఆక్వా రైతుల ఇబ్బందులు మొదలయ్యాయి. పీపాల్లో డీజిల్ కొట్టేందుకు బంకు సిబ్బంది అంగీకరించకపోవటంతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. రొయ్యల చెరువుల్లో ఏరియేటర్లు తిరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే జనరేటర్‌కు కనెక్ట్ చేయటం తప్పనిసరి.



ముదినేపల్లి, మే 22 : ప్రస్తుతం ముదినేపల్లి ప్రాంత ఆక్వా రైతుల వద్ద ఉన్న డీజిల్ స్టాకు సరిపడినంత లేదు. ట్రాక్టర్లలో పీపాలతో బంకులకు వస్తున్నా డీజిల్ కొట్టడం లేదు. ముదినేపల్లి మండలంలో ప్రస్తుతం సుమారు 14 వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతున్నది. ప్రతి చెరువు వద్ద జనరేటర్ ఏర్పాటు చేశారు. పెద్ద చెరువుల వద్ద మూడు జనరేటర్లు చిన్న చెరువుల వద్ద ఒక జనరేటర్ ఉంటుంది. రైతులు తమ వద్ద ఎప్పుడూ 50 నుంచి 100 లీటర్ల డీజిల్‌ను ఉంచుకుంటారు. ఉన్నట్లుండి ఇప్పుడు ఎన్నికల సంఘం బంకుల్లో లూజు అమ్మకాలను నిషేధించటంతో ఆక్వా రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. నిషేధం ఎత్తివేసే వరకు తమ వద్ద ఉన్న నిల్వలు సరిపోవని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ బంకుల్లో డీజిల్, పెట్రోలు లూజు అమ్మకాలపై నిషేధం విధించడంతో ముదినేపల్లి ప్రాంతంలోని 9 బంకుల్లో అమ్మకాలు తగ్గిపోయాయి. ఇంతకు ముందు మండలంలో రోజువారీ సుమారు 9 వేల లీటర్ల డీజిల్ అమ్మకాలు జరగ్గా, గత రెండు రోజులుగా 7 వేల లీటర్లకు పడిపోయాయి. ఎన్నికల సంఘం ఆదేశాలతో పెట్రోలు బంకుల్లో పెట్రోలు, డీజిల్ లూజు అమ్మకాలు నిలిచిపోవటంతో ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పట్టించుకునేందుకు నాయకులెవ్వరూ ముందుకు రావటం లేదు. ఇవే ఆంక్షలు పోలింగ్‌కు ముందు విధిస్తే రాజకీయ పార్టీలు నిరసన వ్యక్తం చేస్తూ రోడ్డెక్కేవని, ఎన్నికలు ముగియటంతో నాయకులు ఈ సమస్యను పక్కన పెట్టేశారని పలువురు ఆరోపిస్తున్నారు.

గుర్తింపు కార్డులు ఇవ్వాలి..

పెట్రోలు బంకుల్లో లూజు సేల్స్‌పై నిషేధం వల్ల ఆక్వా రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జనరేటర్ల వినియోగానికి ఇబ్బందిగా ఉంది. ఆక్వా రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి బంకుల్లో డీజిల్ అమ్మకాలు నిర్వహించాలని ఆక్వా రైతు బొప్పన సుందర రామయ్య డిమాండ్ చేశారు.

నిబంధనలు సడలించాలి..

ఆగిరిపల్లి: లూజు పెట్రోల్ విక్రయంపై నిషేధం భద్రత కోసమే అయినా ఈ నిర్ణయంపై నిరసన వ్యక్తం అవుతోంది. రోడ్డుపై వాహనం ఆగిన వారికి, పొలాల్లో ఇంజన్ వాడి నీరు పెట్టుకునే వారికి, స్లాబుల వద్ద వాడే సిమెంట్ మిల్లర్లకు, క్వారీలలో వాడే భారీ ఎక్స్‌కవేటర్లకు అవసరం అవుతుంది. ప్రభుత్వమే ప్రజల కష్టాలు అర్థం చేసుకుని కొన్ని సడలింపులు ఇవ్వాలని కోరుకుంటున్నారు.



మాట్లాడుతున్న టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్

పిన్నెల్లిని తక్షణం అరెస్టు చేయాలి

కలిదిండి, మే 22 : పోలింగ్ బూత్‌లో ఈవీఎంను ధ్వంసం చేసిన వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంగ్రాజు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం మట్టగుంటలో విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్లలో టీడీపీ సానుభూతిపరులపై అనేక దాడులకు వైసీపీ మూకలు పాల్పడ్డాయన్నారు. ఎమ్మెల్యే పిన్నెల్లి రామ కృష్ణారెడ్డితోపాటు అతడి అనుచరులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. టీడీపీ నాయకులు సంగాని గంగాధరరావు, నాగిడి వీరబ్రహ్మం, వాటాల దశరథ రామయ్య, తిరుమాని గోపాలకృష్ణ, పొనమండ పెంటయ్య, సంగాని వెంకట రాజు, తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పిన్నెల్లిపై అనర్హత వేటు వెయ్యాలి

కైకలూరు: పోలింగ్ రోజున ఈవీఎంను ధ్వంసం చేసిన పిన్నెల్లి రామ కృష్ణారెడ్డిపై అనర్హత వేటు వేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో వైసీపీ అరాచకాలు బయటపడ్డాయని మాచర్ల వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్వయంగా ఈవీఎం మిషన్లు పగలగొడుతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయని వీటి ఆధారంగా ఎన్నికల కమిషన్ ఓట్ల లెక్కింపునకు ముందే అతనిపై అనర్హత వేటు విధించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల్లో హింసలకు పాల్పడిన ప్రతి ఒక్కరిని గుర్తించి పోలీసులు వారిపై కేసులు నమోదు చేయాలని ఇకపై ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. నిందితులతో పాటు అనుమానితులను ముందుగానే గుర్తించి ఓట్ల లెక్కింపు రోజున ఎక్కడా హింస జరగకుండా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు.

4న రాక్షస పాలన అంతం: ముద్దరబోయిన



నూజివీడు, మే 22: జూన్ 4న రాష్ట్రంలో నెలకొన్న రాక్షస పాలన అంతం కానున్నదని నవ్యాంధ్ర నూతన సీఎంగా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించ నున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడులోని తన కార్యాలయంలో మాట్లాడుతూ అసత్య ప్రచారంతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి అడుగడుగునా విధ్వంసకర పాలన సాగించాలని ఈ జగనాసుర పాలనకు చరమగీతం పాడుతూ రాష్ట్ర ప్రజలు ఈ నెల 13న తమ ఓటుతో తీర్పుచెప్పారని జూన్ 4తో వైసీపీ ప్రభుత్వం అంతం అవుతుందన్నారు. రాష్ట్రంలో ఏదో విధంగా తిరిగి అధికారంలోకి రావాలని వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించిందని అల్లర్ల పై న్యాయ విచారణ జరిపించాలన్నారు. జగన్ కోసం చట్టాన్ని అతిక్రమిస్తే జైలుపాలయ్యేది అధికారులే అన్న సంగతి గుర్తించాలన్నారు. సిట్ రిపోర్టును తక్షణం బహిర్గతం చేయాలని టీడీపీ నాయకులపై దాడిచేసిన వారిని, ఈవీఎంలను పగులగొట్టిన ఎమ్మెల్యేలపై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజారోగ్యాన్ని వైసీపీ పట్టించుకోకపోవడం వల్లే బిల్లులు రాక ఆసుపత్రుల యాజమాన్యాలు ఆరోగ్యశ్రీ సేవలను బంద్ చేశాయన్నారు. పాలన వ్యవస్థలు తిరిగి గాడిలో పడాలని చంద్రబాబు ముఖ్యమంత్రి అవ్వాలని రాష్ట్రప్రజలు తమ తీర్పును బ్యాలెట్ బాక్స్‌లో నిక్షిప్తం చేశారన్నారు.





గురజ, చీపురుగూడెంలలో కేక్ కట్‌చేసి సంబరాలు

అభివృద్ధి పథంలో కృష్ణామిల్క్ యూనియన్

చైర్మన్ చలసాని ఐదేళ్ల పదవీకాలం పూర్తి సందర్భంగా సంబరాలు

ముదినేపల్లి రూరల్, మే 22: గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం పరిధిలోని గురజలో కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పదవీ బాధ్యతలు చేపట్టి ఐదేళ్లు పూర్తి అయిన సందర్భంగా జిల్లా పాలకవర్గ సభ్యులు వల్లభనేని భాస్కర కుటుంబ వెంకట సుబ్బారావు, అర్జా వెంకట నగేష్ పాల్గొని కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ చలసాని వచ్చిన తరువాత ఈ ఐదేళ్ల కాలంలో రూ. 54 ఉన్న పాల సేకరణ ధరను పలు దఫాలుగా రూ. 80 చేశారని, రూ. 250 కోట్లు బోనస్ చెల్లింపు జరిగిందని, కొత్తగా పాల ఉత్పత్తుల భవనం ప్రారంభించారని, అలాగే వీరవల్లిలో నూతన పాల ఫ్యాక్టరీలను సకాలంలో ప్రారంభించారన్నారు. అర్జా వెంకట నగేష్ మాట్లాడుతూ పాడి రైతు సంక్షేమంలో భాగంగా క్షీరబంధు ద్వారా రూ. 8 కోట్లను మరణించిన 1543 మంది పాడి రైతు కుటుంబాలకు ఆసరాగా రూ.50 వేలు చొప్పున ఇచ్చారన్నారు. ఐదు కోట్ల ఖర్చుతో 2266 పాడి రైతు కుటుంబాల్లో వివాహం సందర్భంగా రూ. 20వేలు విలువగల బంగారు నాణెం ఇవ్వడం, నాలుగు కోట్ల ఖర్చుతో పసుజాతి అభివృద్ధికి మేలు జాతి వీర్యం సరఫరా చేయటం, రూ. 11 కోట్ల ఖర్చుతో పాడి పశువుల అత్యవసర వైద్య సదుపాయం అందించటం వంటి కార్యక్రమాలు నిర్వహించి చలసాని కృష్ణామిల్క్ యూనియన్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. మేనేజరు తోట సత్యనారాయణ, ఫీడ్ కమిటీ సభ్యులు మోతుకూరి వెంకటేశ్వరరావు, వివిధ పాల సంఘాల అధ్యక్షులు, సూపర్‌వైజర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

చాట్రాయి: కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు 5 ఏళ్ళు పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా, చీపురుగూడెం పాల సహకార సంఘంలో బుధవారం సంస్థ డైరక్టర్ బొట్టు రామచంద్రరావు కేక్ కట్ చేసి పాల రైతులకు మిఠాయిలు పంచారు. చలసాని పాడి రైతుల శ్రేయస్సుకు అధిక ప్రాధాన్యమిచ్చి సంస్థను ప్రగతి పథంలో నడిపించారని, క్షీరబంధు, కల్యాణ మస్తు, ప్రగతి, ఆరోగ్య కృష్ణా, ప్రమాద బీమా అమలు చేస్తున్నారని కొనియాడారు. మర్లపాలెం, తుమ్మగూడెం, చిత్తపూరు, తదితర పాల సహకార సంఘలలో సంబరాలు జరిపారు. గ్రామ ప్రముఖులు జగదీష్, రామకృష్ణ, సంఘాల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు, పాడి రైతులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఆగిరిపల్లిలో లక్ష్మీనరసింహుడి కల్యాణం



ఆగిరిపల్లి, మే 22: ఆగిరిపల్లిలో శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి వారి జయంతి సందర్భంగా బుధవారం స్వామికి విశేష స్నపన, అలంకరణ, అర్చన, శాంతి కల్యాణం మూల మంత్ర హోమం, పూర్ణాహుతి వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలుగా వై.శ్రీనివాస రావు దంపతులు, పెదవుటుపల్లి వాస్తవ్యులు ఏ.నరసింహారావు దంపతులు పాల్గొన్నారు. ఈవో పర్యవేక్షించారు.

వరహాపట్నంలో స్వామికి లక్షతులసి పూజ



కైకలూరు, మే 22: వరహాపట్నం శ్రీలక్ష్మీ నృశింహస్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. బుధవారం స్వామి వారి జయంతిని పురస్కరించుకొని ఆలయంలో లక్షతు లసి పూజ, సుదర్శన హోమం అనంతరం శాంతి కల్యాణం జరిపారు. భక్తులు పెద్దయెత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

వైభవంగా మీసాల వేంకటేశుడి కల్యాణం

కైకలూరు శ్రీ భూ సమేత మీసాల వేంకటేశ్వరస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండవగా నిర్వహించారు. బుధవారం రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై స్వామి, అమ్మవార్లను ఊరేగిం పుగా తీసుకువచ్చి కల్యాణమహోత్సవాన్ని ఘనంగా జరిపారు. వార్షిక బ్రహ్మోత్స వాల సందర్భంగా ఉదయం స్వామివారికి విష్వక్సేన పూజ, నిత్యహోమం, బలిహరణ వంటి కార్యక్రమాలను వైభవోపేతంగా నిర్వహించారు. భారీగా భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు. ఆలయ అధికారి వీఎన్‌కే శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించారు.

కలిదిండి: కలిదిండిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం ఆలయ అర్చకులు అగ్నిహోత్రం ఆత్రేయ బాబు ఆధ్వర్యంలో సహాయ అర్చకులు రొంపిచర్ల శ్రీనివాస దేవ్, లీలా కృష్ణమాచార్యులు వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ మేనేజర్ బి.గోపాలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ చైర్మన్ బోయిన రామకృష్ణ, ధర్మకర్తలు ఆకుల మురళీకృష్ణ, బత్తిన శ్రీనివాసరావు, దేసు నాగ భవాని, యలవర్తి శాంతి, తాటి నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



కైకలూరులో మీసాల వేంకటేశ్వరస్వామి కల్యాణం



సోమేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



ముదినేపల్లి: ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ సోమేశ్వరస్వామివారి దేవస్థానంలో బుధవారం స్వామివార్షిక కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. పెదతుమ్మిడికి చెందిన యాజ్ఞీకుడు ఈశ్వర శర్మ ఆధ్వర్యంలో దేవస్థానం అర్చకుడు అయిలూరి సుబ్బరాయ శర్మ స్వామివారిని, అమ్మవారిని పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెను చేసి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అఖండ స్థాపన, వాస్తు పూజ, విఘ్నేశ్వర పూజ, మూర్తి హోమములు జరిపారు. ధ్వజారోహణ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని స్వామివార్లకు పూజలు జరిపారు. దేవస్థానం ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో కళ్యాణోత్సవాలు జరుగుతున్నాయి.

రేపటి నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ



చాట్రాయి జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంఈవో

చాట్రాయి, మే 22: చాట్రాయి జడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 24 నుంచి 31 వరకు టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో వీఎస్వీ బ్రహ్మచారి చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చాట్రాయిలో తొలిసారి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మండల పరిధిలో టెన్త్ వార్షిక పరీక్షలలో ఫెయిల్ అయిన 160 మంది విద్యార్థులు ఇప్పుడు పరీక్షలు రాస్తున్నారని చెప్పారు. 24న జరిగే తెలుగు పరీక్షకు 66 మంది, 25న హిందీ పరీక్షకు 36 మంది, 27న ఇంగ్లీష్ పరీక్షకు 36 మంది, 28న గణిత పరీక్షకు 94 మంది, 29న ఫిజికల్ సైన్స్ పరీక్షకు 99 మంది, 30న జీవ శాస్త్రం పరీక్షకు 99 మంది, 31న సాంఘిక శాస్త్రం పరీక్షకు 47 మంది హాజరవుతున్నారని ఎంఈవో వివరించారు.

కలిదిండి: ఈ నెల 24వ తేదీ నుంచి నిర్వహించే పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈవో ప్రభాకర్ బాబు తెలిపారు. కలిదిండి జడ్పీ హైస్కూల్, శశి హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో మొత్తం 330 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు.

నూతన సాంకేతికతతో నాణ్యమైన ఉత్పత్తులు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త

నూజివీడు టౌన్, మే 22: నూతన సాంకేతిక విధానాలను అనుసరించి రైతులు నాణ్యమైన ఉత్పత్తులను పొందవచ్చని, నూజివీడు మామిడి పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త వి.కనక మహాలక్ష్మి అన్నారు. నూజివీడు మామిడి పరిశోధనా కేంద్రంలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ వారంరోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా మామిడిపై పండు ఈగ ఉధృతి అధికంగా ఉందని, రైతులు తప్పనిసరిగా పండు ఈగను ఆకర్షించే బుట్టలను లేదా ఎరలను ఎకరానికి 5 నుంచి 6 చొప్పున ఏర్పాటు చేసుకోవాలన్నారు. మామిడి పరిశోధనా కేంద్రంలో వీటిని అందుబాటులో ఉంచటం జరిగిందని, పండు ఈగ ఆశించి కుళ్ళిన కాయలను సేకరించి తగులబెట్టడం లేదా నేలలో పాతిపెట్టడం గానీ చేయాలన్నారు. మామిడిని ఆశించే వివిధ రకాల తెగుళ్ళపై రైతులకు వివరించారు. అనంతరం మామిడిలో నీటి యాజమాన్య పద్ధతులను శాస్త్రవేత్త కె.రాధారాణి వివరించారు నూజివీడు ఉద్యానవన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పి.విజయలక్ష్మి, జిల్లా ఉద్యానవనశాఖ అధికారిణి జె.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

హోమియో వైద్యశాలకు విరాళం



ఆగిరిపల్లి, మే 22: నిర్మాణంలో ఉన్న స్థానిక హోమియో వైద్యశాల సుందరీ కరణకు రూ. 20 వేల విరాళాన్ని స్థానిక శశిధర్ కమ్యూనికేషన్స్ అధినేత యం దూరి శశిధర్ తన తండ్రి పురుషోత్తం జయంతిని పురస్కరించుకుని అంద జేశారు. దాతను డాక్టర్ రజిత అభినందించారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ ప్రారంభం

ముసునూరు, మే 22: రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్నట్టు మండల వ్యవసాయ అధికారి ఎస్.మధుమోహన్ తెలిపారు. బుధవారం ముసునూరు ఆర్బీకేలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ ప్రారంభమైంది. జీలుగ 1000 కేజీలు, పిల్లిపెసర 3000 కేజీలు, జనుము 700 కేజీల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జీలుగ కేజీ విత్తనాలు రూ. 88లు కాగా సబ్సిడీ పోను రూ. 44లు, పిల్లిపెసర కేజీ విత్తనాలు రూ. 134లు కాగా సబ్సిడీ పోను రూ. 67లు, జనుము కేజీ విత్తనాలు రూ.88లు కాగా సబ్సిడీ పోను రూ.44లకు విక్రయిస్తారన్నారు. రైతుకి గరిష్ఠంగా 5 ఎకరాలకు సరిపడ పచ్చిరొట్ట విత్తనాలు ఇవ్వనున్నట్లు, కావల్సిన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, ఫోన్ నెంబర్ తీసుకుని రావాలని సూచించారు. మండల వ్యాప్తంగా ఉన్న అన్ని ఆర్బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ప్రతి మనిషి తోటివారికి సాయపడాలి



చాట్రాయి, మే 22: ప్రతి మనిషి తోటివారికి సాయపడాలని సీఎస్ఐ కృష్ణా, గోదావరి అధ్యక్ష ఖండ పీఠాధిపతి బిషప్ తంటేపూడి జార్జ్ కుర్నేలియస్ అన్నారు. మండలంలోని పోలవరంలో సీఎస్ఐ సంఘస్తులు నిర్మించిన పాస్టర్ నివాస గృహాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ క్రీస్తు మార్గంలో అందరూ నడిస్తే సమాజం సుఖ శాంతులతో వర్ధిల్లుతుందన్నారు. పాస్టర్‌కు గృహం నిర్మించి ఆదర్శంగా నిలిచిన పోలవరం సంఘస్తులను ఆయన అభినందించారు. సీఎస్ఐ డీనరీలు, పాస్టర్లు పాల్గొన్నారు.

ముసునూరు పీహెచ్‌సీలో ప్రసవాలు ప్రారంభం



ముసునూరు, మే 22: ముసునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాలుగున్నరేళ్ళ తరువాత ప్రసవాలు చేయడంతో వైద్యాధికారిణి షకీనా ఇవాంజలి పనితీరుపై హర్షం వ్యక్తమౌతోంది. గత ప్రభుత్వంలో ఈ పీహెచ్‌సీలో ఎక్కువ సంఖ్యలో ప్రసవాలు జరిగాయి. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత నాడు-నేడు పథకంలో పీహెచ్‌సీ అభివృద్ధికి పనులు చేపట్టారు. పనులు పూర్తిచేయకుండా కాంట్రాక్టర్ వదిలివేయడంతో పీహెచ్‌సీలో ఆపరేషన్ థియేటర్, వార్డు గదులు సైతం వినియోగించుకునే పరిస్థితి లేక నాలుగున్నరేళ్ళలో ఒక్క ప్రసవం కూడా ఈ పీహెచ్‌సీలో జరగలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల ఈ పీహెచ్‌సీకి నూతన వైద్యాధికారిణిగా వచ్చిన షకీనా ఇవాంజలి పీహెచ్‌సీలోని ఆపరేషన్ థియేటర్, ఇతర గదులను సైతం శుభ్రం చేయించి, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ, ఉన్న పరిక రాలతో గర్భిణులకు ప్రసవాలు చేయడం ప్రారంభించారు. పది రోజులలోపే ఐదు సుఖ ప్రసవాలు చేసిన వైద్యాధికారిణి పనితీరును పలువురు అభినందిస్తున్నారు.

మామిడి ముక్కల కంపెనీలతో ఉపాధి

పాకెట్ మనీ సంపాదించుకుంటున్నామన్న విద్యార్థినులు



నూజివీడు టౌన్, మే 22: మామిడి రైతుకు అండగా నిలవడమే కాదు గ్రామీణ ప్రాంత మహిళలకు వేసవిలో ఉపాధికి అవకాశాలు కల్పిస్తున్నాయి మామిడి అనుబంధ పరిశ్రమ అయిన ముక్కల కంపెనీలు. నూజివీడు మండలంలో దాదాపు మూడు ప్రదేశాల్లో ముక్కల కంపెనీలు (ఆమ్‌చూర్ తయారీకి ముడిసరుకు తయారు చేసేవి) ఉండగా, కలెక్టర్ కాయకు ప్రధానంగా మార్కెట్ లభిస్తుండగా, ఆయా గ్రామాల్లో వందలాది మంది మహిళలకు ఈ ముక్కల కంపెనీలు ఉపాధి మార్గాన్ని చూపుతున్నాయి. కళాశాల విద్యార్థినులు ఈ ముక్కల కంపెనీలను ఆధారంగా చేసుకుని తాము చదువుకునే సమయంలో కావాల్సిన పాకెట్ మనీని ఈ రెండు నెలల్లో సంపాదించుకుంటున్నారు. ఒక్కో విద్యార్థిని ఈ రెండు నెలల్లో సుమారు 30 వేల వరకు పాకెట్ మనీగా సంపాదించుకుంటున్నామని తెలిపారు. నూజివీడు నియోజకవర్గంలో మూడు ముక్కల కంపెనీలు ఉండగా, పక్కనే ఉన్న తిరువూరు నియోజకవర్గంలో మరో ఐదు వరకు ముక్కల కంపెనీలు ఉన్నాయి. ప్రభుత్వం తరవున వీటికి ప్రోత్సాహకాలు అందిస్తే మామిడి రైతుకు మరింత మెరుగైన మార్కెట్‌ను అందించడంతో పాటు వేసవిలో మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.